# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 7 | శుక్రవారం | 21.08.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 7 | Friday | 21.08.2026 | Pages: 8 | Rate: 2


## కాంగ్రెస్ ఓ కొత్త 'ముస్లిం లీగ్'



- వందేమాతరాన్ని అవమానించడం దారుణం
- ఓటు బ్యాంకు కోసమే దేశ ఆత్మగౌరవం తాకట్టు
- కాంగ్రెస్ తీరుపై బీజేపీ నేత నితిన్ నబీన్ ఫైర్
- తొలి రెండు చరణాలే పాడాలన్న నిర్ణయంపై ఆగ్రహం

4



## 40 ఏళ్లకే దేశ ప్రధాని!

రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణుల ఘన నివాళి

మాజీ ప్రధానిని స్మరించుకున్న నరేంద్ర మోదీ

4

పెంపుడు జంతువులకున్న వసతులు

## బడుల్లో లేవా!

- మహారాష్ట్ర పాఠశాలల్లో అధ్వాన పరిస్థితులు
- విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి
- నాయకుల తీరుపై మండిపడ్డ అభిజీత్ దిప్కే

4



# 22ఏ ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం




- కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- రైతుల భూ భద్రతకే 'భూ భారతి'
- నేటి నుంచి జిల్లాల వారీగా సమీక్షలు
- అధికారులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

### ప్రతి ఫిర్యాదుపై చివరి వరకు పర్యవేక్షణ

22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని, కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును ఒక బాధ్యతగా తీసుకుని సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. 22ఏ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తూ అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, వచ్చిన కాల్స్‌కు అందిస్తున్న సమాచారం తదితర అంశాలపై బుధవారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి సమీక్షించారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, ఈ నాలుగు జిల్లాల దరఖాస్తుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

- హైదరాబాద్, ఆగస్టు 20

మిగతా 2 లో




## సమస్యలు తేల్చడమే అసలైన సమాఖ్య స్ఫూర్తి

- దక్షిణాది ఎదిగితేనే దేశం పరుగులు
- కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలి
- కాళేశ్వరం, పాలమూరుకు చేయూతనివ్వాలి
- విభజన సమస్యలకు ముగింపు పలకాలి
- 32వ దక్షిణ ప్రాంతీయ మండలి భేటీకి హైదరాబాద్ సిద్ధం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

కేంద్రం, రాష్ట్రాల మధ్య సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే నిజమైన సహకార సమాఖ్యవాదమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య భిన్న ప్రయోజనాలు ఎదురైనప్పుడు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా పరిష్కారం కనుగొనడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కలిసి అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి మరింత వేగంగా పరుగులు పెడుతుందని పేర్కొన్నారు.

## పొంగులేటి భారీ అవినీతి

చర్చకు సవాల్ చేసిన బీజేపీ నేత

మీడియా పాయింట్‌లో మంత్రి కోసం ఎదురుచూపు



.. వివరాలు 3లో

## ఏసీబీ వలలో 'కోట్ల' అధికారి

- శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఏకకాలంలో సోదాలు
- రూ.6.87 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ
- మార్కెట్‌లో భారీ విలువ ఉంటుందని అంచనా
- భూములు.. ప్లాట్లు.. బంగారం.. వాహనాలు
- అక్రమాస్తుల కేసులో అరెస్ట్.. కోర్టుకు తరలింపు

2






## దక్షిణాది ఒక్కటైతేనే బలం!

- రాష్ట్రాల మధ్య బలమైన సహకారం అవసరం
- ఆర్థిక కూటమిగా దక్షిణాది ఎదగాలి
- నీట్ రద్దుపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి
- డీలిమిటేషన్‌లో ప్రాతినిధ్యం తగ్గొద్దు

2



## ధాన్యం బకాయిలపై కొరడా!



- 20 మంది రైస్ మిల్లర్ల జాబితా ఈడీకి
- ఆస్తులు.. బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తునకు నివేదిక
- హవాలా మార్గంలో నిధుల మళ్లింపుపైనా అనుమానాలు
- తొమ్మిది మంది మిల్లర్లపై పీడీ చట్టానికి రంగం సిద్ధం
- బకాయిల వసూలుకు సివిల్ సప్లయ్స్ శాఖ కఠిన చర్యలు

3



## సుష్మిత వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

కూతురి మాటలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?

క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ

3





# ఏసీబీ వలలో 'కోట్ల' అధికారి

## శ్రీనివాసరెడ్డి ఇంటిపై ఏకకాలంలో సోదాలు

## రూ.6.87 కోట్ల ఆస్తులు గుర్తించిన ఏసీబీ

## మార్కెట్‌లో భారీ విలువ ఉంటుందని అంచనా

## భూములు.. ప్లాట్లు.. బంగారం.. వాహనాలు

## అక్రమాస్తుల కేసులో అరెస్ట్.. కోర్టుకు తరలింపు

**హైదరాబాద్, ఆగస్టు 20:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్ట్ చేశారు. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు పలు ప్రాంతాల్లో నిర్వహించిన సోదాల్లో భారీగా స్థిర, చరాస్తులను గుర్తించారు. అధికారిక లెక్కల ప్రకారం గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ.6.87 కోట్లుగా ఉండగా, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉంటుందని ఏసీబీ అంచనా వేసింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలపై ఏసీబీ డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని సంతోషిమాత కాలనీలో ఉన్న శ్రీనివాసరెడ్డి నివాసంతో పాటు కార్యాలయం, ఆయనకు సంబంధించిన ఇతర ప్రాంతాల్లో గురువారం ఉదయం నుంచి సోదాలు నిర్వహించారు. ఆస్తులకు సంబంధించిన పత్రాలు, బ్యాంకు లావాదేవీలు, పెట్టుబడుల వివరాలను అధికారులు పరిశీలించారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం కర్మన్‌ఘాట్‌లో శ్రీనివాసరెడ్డికి రెండు నివాస ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ రూ.2.63 కోట్లుగా లెక్కించారు. అదే ప్రాంతంలో రూ.1.61 కోట్ల విలువైన పెంట్‌హౌస్‌ను గుర్తించారు. యాచారం మండలం నల్లవెల్లి గ్రామంలో పది ఎకరాల వ్యవసాయ భూమితో పాటు వివిధ ప్రాంతాల్లో ఎనిమిది ఓపెన్ ప్లాట్లు ఉన్నట్లు సోదాల్లో బయటపడింది. నరేంద్ర బార్ అండ్ రెస్టారెంట్‌లో రూ.86 లక్షల పెట్టుబడి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రూ.4 లక్షల నగదుతో పాటు బ్యాంకు ఖాతాలో రూ.8.60 లక్షల నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

### 680 గ్రాముల బంగారం.. ఏడు వాహనాలు

సోదాల్లో 680 గ్రాముల బంగారు ఆభరణాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు కలిపి మొత్తం ఏడు వాహనాలను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.59 లక్షలుగా లెక్కించారు. ఇంట్లో మరో రూ.11 లక్షల విలువైన వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలను గుర్తించినట్లు తెలిపారు. బ్యాంకులో 46 తులాల బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు కూడా దర్యాప్తులో బయటపడింది.

### 2009లోనూ అక్రమాస్తుల కేసు!

శ్రీనివాసరెడ్డిపై గతంలోనూ ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైనట్లు ఏసీబీ వెల్లడించింది. 2009లో మహేశ్వరం మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఆయనపై అక్రమాస్తుల కేసు నమోదైనట్లు తెలిపింది. అనంతరం మహేశ్వరం తహసీల్దార్‌గా కూడా ఆయన పనిచేసినట్లు సమాచారం. తాజా సోదాల్లో లభించిన పత్రాలు, ఆస్తులు, పెట్టుబడులు, బ్యాంకు లావాదేవీలపై ఏసీబీ అధికారులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి శ్రీనివాసరెడ్డిని అరెస్ట్ చేసిన అధికారులు, హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు.

# 22ఏ ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

- ప్రతి ఫిర్యాదుపై చివరి వరకు పర్యవేక్షణ
- కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు
- రైతుల భూ భద్రతకే 'భూ భారతి'
- నేటి నుంచి జిల్లాల వారీగా సమీక్షలు
- అధికారులకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్టు 20:** భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ శాఖను మరింత ప్రజలకు చేరువ చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 22ఏ నిషేధిత భూముల విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును కేవలం దరఖాస్తుగా కాకుండా బాధ్యతగా తీసుకుని సమస్య పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. మరోవైపు రైతుల భూములకు భద్రత కల్పించేందుకే 'భూ భారతి' సర్వే చేపడుతున్నామని వెల్లడించిన మంత్రి.. శుక్రవారం నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. 22ఏ సమస్యలపై ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు వస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారం, ఎక్కువగా ఏ అంశాలపై ప్రజలు సంప్రదిస్తున్నారనే విషయాలపై పొంగులేటి అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఇప్పటివరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్‌కు వెంటనే పంపించాలని మంత్రి ఆదేశించారు. భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? రికార్డుల్లో వాస్తవ పరిస్థితి ఏమిటి? అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలన్నారు.




### కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

సమస్య చెప్పిన తర్వాత పరిష్కారం కోసం ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని పొంగులేటి స్పష్టం చేశారు. సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు కొత్తగా వచ్చిన వాటినీ వెంటనే పరిశీలించాలని ఆదేశించారు. ఇకపై దరఖాస్తులు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే వ్యవస్థను రూపొందించాలని సూచించారు. "రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోవద్దు. పరిష్కారం అయ్యే వరకు పర్యవేక్షించాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### రైతుల భూ భద్రతకే 'భూ భారతి'

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం నారాయణపురంలో భూ రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పొంగులేటి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా రైతుల భూములకు భద్రత కల్పించడం, భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే 'భూ భారతి' సర్వే లక్ష్యమని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో భూములు లేకపోయినా బోగస్ పాస్‌పుస్తకాలు సృష్టించి రైతుబంధు నిధులు స్వాహా చేసిన ఘటనలు ఉన్నాయని ఆరోపించారు. ధరణి వ్యవస్థలో జరిగిన తప్పుల కారణంగా రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని ఏడు గ్రామాల్లో భూ భారతి సర్వే ప్రారంభమైందని తెలిపారు. తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 70 గ్రామాల్లో సర్వే చేపడుతున్నామని, దశలవారీగా ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.

### నేటి నుంచి జిల్లాల బాట

ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు భూ సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు పొంగులేటి జిల్లాల వారీ సమీక్షలు చేపట్టనున్నారు. ఈ సమావేశాలు కేవలం అధికారిక సమీక్షలకే పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కార మార్గాలను నిర్దేశించేలా నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సబ్‌రిజిస్ట్రార్లతో పాటు సంబంధిత శాఖల అధికారులు ఈ సమీక్షల్లో పాల్గొంటారు. స్థానిక ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా భాగస్వాములను చేయనున్నారు. రెవెన్యూ సమస్యలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థల సమస్యలపైనా సమీక్షించనున్నారు. తొలుత శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాలలో నిర్వహించనుండగా, శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అంశాలపై నిజామాబాద్‌లో సమీక్ష చేపట్టనున్నారు. మొత్తంగా 22ఏ సమస్యల పరిష్కారం నుంచి భూభారతి సర్వే వరకు రెవెన్యూ వ్యవస్థను క్షేత్రస్థాయిలో పరుగులు పెట్టించేందుకు ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది.

# దక్షిణాది ఒక్కటైతేనే బలం!



## రాష్ట్రాల మధ్య బలమైన సహకారం అవసరం

## డ్రగ్స్‌పై ఉమ్మడి పోరు సాగిద్దాం

## ఆర్థిక కూటమిగా దక్షిణాది ఎదగాలి

## నీట్ రద్దుపై కేంద్రం నిర్ణయం తీసుకోవాలి

## డీలిమిటేషన్‌లో ప్రాతినిధ్యం తగ్గొద్దు

**మహాబలిపురం:** దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణకు అన్ని రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాలని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ పిలుపునిచ్చారు. రాష్ట్రాల మధ్య బలమైన సహకారం ఏర్పడితేనే ఆర్థికంగా మరింత శక్తిమంతమైన దక్షిణ భారతాన్ని నిర్మించగలమన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉమ్మడి పోరాటం, ఆర్థిక కారిడార్ల నిర్మాణం, సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థ విస్తరణతో పాటు నదీ జలాలు, నీట్, డీలిమిటేషన్ వంటి కీలక అంశాల్లో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడుకునేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణాది ప్రాంతీయ మండలి సమావేశంలో విజయ్ ప్రసంగించారు. దేశ స్థూల జాతీయోత్పత్తిలో 30 శాతానికి పైగా వాటా కలిగిన దక్షిణాది రాష్ట్రాలు తయారీ, ఎగుమతులు, సేవల రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ ఆర్థిక బలాన్ని మరింత పెంచుకునేందుకు రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం అత్యవసరమన్నారు. తయారీ కేంద్రాలు, సరకు రవాణా పార్కులు, ప్రత్యేక రవాణా మార్గాల నిర్మాణం ద్వారా దక్షిణాది ప్రాంతాన్ని సమీకృత ఆర్థిక కూటమిగా తీర్చిదిద్దాలని విజయ్ ఆకాంక్షించారు. బెంగళూరులోని బొమ్మసంద్ర నుంచి హోసూరు వరకు మెట్రో రైలు విస్తరణ అంతర్రాష్ట్ర సహకారానికి మంచి నమూనా అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు సంబంధిత రాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. 'డ్రగ్స్ రహిత దక్షిణ భారతం' లక్ష్యంగా అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పనిచేయాలని విజయ్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన నిఘా సమాచారాన్ని రాష్ట్రాలు ఎప్పటికప్పుడు పంచుకోవాలని, డ్రగ్స్ ముఠాలపై ఉమ్మడిగా ఉక్కుపాదం మోపాలని సూచించారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలు, అనధికార పంపిణీపైనా కఠిన నిఘా అవసరమన్నారు. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధిలో సముద్ర ఆధారిత ఆర్థిక వ్యవస్థకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని విజయ్ సూచించారు. 1,076 కిలోమీటర్ల తీరప్రాంతం కలిగిన తమిళనాడు.. ఓడరేవులు, తీరప్రాంత నౌకాయానం, మత్స్య పరిశ్రమ, సముద్ర ఆధారిత పరిశ్రమలు, పర్యాటక రంగాల్లో ఇతర రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రాబోయే ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులో రాష్ట్రాల అవసరాలతో పాటు వాటి పనితీరునూ పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలకు నష్టం జరగకూడదన్నారు. వస్తు సేవల పన్ను అమలు తర్వాత రాష్ట్రాలు కోల్పోయిన ఆర్థిక స్వేచ్ఛపైనా పునరాలోచన అవసరమని అభిప్రాయపడ్డారు. నీట్ పరీక్షపై తమిళనాడు వ్యతిరేకతను విజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ విధానం గ్రామీణ, పేద విద్యార్థులకు నష్టం కలిగిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర కోటాలోని వైద్య, దంత, ఆయుష్ సీట్లను 12వ తరగతి మార్కుల ఆధారంగా భర్తీ చేసుకునే అవకాశం తమిళనాడుకు కల్పించాలని కేంద్రాన్ని కోరారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన కారణంగా దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంటులో ప్రాతినిధ్యం కోల్పోయే పరిస్థితి రాకూడదని విజయ్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్యం తగ్గదనే చట్టపరమైన హామీని కేంద్రం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల్లో న్యాయస్థానాల తీర్పులు, ట్రైబ్యునళ్ల అవార్డులను తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. కావేరీ జలాల విషయంలో ఆదేశాలను సకాలంలో అమలు చేయడంతో పాటు ముల్లపెరియార్ ఆనకట్ట భద్రత, నీటి నిల్వను 152 అడుగులకు పెంచే అంశంలో న్యాయస్థానాల నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు. "బలమైన రాష్ట్రాలతోనే బలమైన దేశం సాధ్యం. విభేదాలను చర్చలు, పరస్పర గౌరవం, చట్టపాలనతో పరిష్కరించుకునేందుకు తమిళనాడు సిద్ధంగా ఉంది" అని విజయ్ స్పష్టం చేశారు.

# సమస్యలు తేల్చడమే అసలైన సమాఖ్య స్ఫూర్తి

## దక్షిణాది ఎదిగితేనే దేశం పరుగులు

## కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయం చేయాలి

## కాళేశ్వరం, పాలమూరు పథకాలకు కేంద్రం చేయూతనివ్వాలి

## విభజన సమస్యలకు ఇకనైనా ముగింపు పలకాలి

## 32వ దక్షిణ ప్రాంతీయ మండలి భేటీకి హైదరాబాద్ సిద్ధం

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మహాబలిపురం, ఆగస్టు 20:** కేంద్రం, రాష్ట్రాల మధ్య సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే నిజమైన సహకార సమాఖ్యవాదమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రాల మధ్య భిన్న ప్రయోజనాలు ఎదురైనప్పుడు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా పరిష్కారం కనుగొనడమే సమాఖ్య వ్యవస్థకు అసలైన పరీక్ష అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కలిసి అభివృద్ధి చెందితే దేశాభివృద్ధి మరింత వేగంగా పరుగులు పెడుతుందని పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో తెలంగాణ తరఫున భట్టి విక్రమార్క పలు కీలక అంశాలను ప్రస్తావించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటా, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ఆర్థిక సహాయం, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని పెండింగ్ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై తెలంగాణ వైఖరిని స్పష్టం చేశారు. మహాబలిపురంలోని చారిత్రక కట్టడాలను ఉదాహరణగా ప్రస్తావించిన భట్టి.. బలమైన నిర్మాణంలో ప్రతి భాగం ఒకేలా ఉండాల్సిన అవసరం లేదని, కానీ ప్రతి భాగం తన వంతు భారాన్ని మోయాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. భారత సమాఖ్య వ్యవస్థ కూడా ఇదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, సమర్థంగా సమన్వయం చేయగల వ్యవస్థలే నిజమైన సమాఖ్యవాదానికి నిదర్శనమన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు, ప్రతిభను ఆకర్షించడంలో రాష్ట్రాల మధ్య పోటీ సహజమేనన్నారు. అయితే నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్రాల సరిహద్దులు అడ్డుకావని గుర్తుచేశారు. సమస్యలు కూడా రాష్ట్ర సరిహద్దులను ప్రభుత్వ ఫైళ్ల కంటే వేగంగా దాటుతాయని చమత్కరించారు. అందుకే దక్షిణ ప్రాంతీయ మండలి వంటి వేదికల ప్రాధాన్యం మరింత పెరిగిందన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ వైఖరి స్పష్టంగా ఉందని భట్టి పేర్కొన్నారు. ఇప్పటికే ఏర్పాటైన చట్టపరమైన వ్యవస్థల ప్రకారం రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటాను కోరుతున్నామని తెలిపారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలు వర్తింపజేయాలని కోరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ట్రిబ్యునల్ పరిధిలో ఉన్నందున చట్టపరమైన ప్రక్రియ ద్వారా వీలైనంత త్వరగా పరిష్కారం రావాలని ఆకాంక్షించారు. మిగులు జలాలపై దిగువ రాష్ట్రంగా తెలంగాణకు ఉన్న హక్కులను కాపాడాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని స్పష్టం చేశారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని భట్టి కోరారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయని, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు ముందుకు సాగుతున్నాయని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి కేంద్రం సహకరించాలని కోరారు. సాగునీటి ప్రాజెక్టులు కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించిన అంశాలుగా కాకుండా ప్రజల జీవన ప్రమాణాలను మార్చే అభివృద్ధి ప్రాజెక్టులుగా చూడాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి వచ్చి 12 ఏళ్లు గడిచినా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లో ఉండటాన్ని భట్టి ప్రస్తావించారు. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా వాటికి తుది పరిష్కారం చూపాల్సిన సమయం వచ్చిందన్నారు. "పరిష్కారం అంటే అంతులేని ఉత్తర ప్రత్యుత్తరాలు కాదు. ప్రతి కొన్నేళ్లకు కొత్త అర్థాలు, కొత్త వివరణలు ఇవ్వడం కాదు. పెండింగ్ అంశాలు ఇక తుది నిర్ణయాలు, సమర్థవంతమైన అమలు దిశగా సాగాలి" అని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్ల విభజనకు సంబంధించి 23 సంస్థలపై తెలంగాణ తన అభిప్రాయాలను ఇప్పటికే కేంద్ర హోంశాఖకు సమర్పించిందన్నారు. సమస్యల పరిష్కారానికి తెలంగాణ సిద్ధంగా ఉన్నప్పటికీ, అది పునర్వ్యవస్థీకరణ చట్టం పరిధిలోనే జరగాలని తేల్చిచెప్పారు. నీటి భద్రత, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా, సరకు రవాణా వ్యవస్థలు, ఆర్థిక పోటీతత్వం రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని భట్టి పేర్కొన్నారు. వీటిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు ఒకవైపు పోటీ పడుతూనే మరోవైపు పరస్పరం సహకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. "దక్షిణ భారతదేశం కలిసి అభివృద్ధి చెందితే.. భారతదేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుంది" అని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని భట్టి ప్రకటించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సమస్యలకు చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారాలు రావాలని ఆకాంక్షించారు. సమస్యల పరిష్కారానికి మరో ట్రిబ్యునల్, మరో కమిటీ, మరోసారి ఉత్తర ప్రత్యుత్తరాలు అవసరం లేని స్థాయిలో నిర్ణయాలు జరగాలని కోరారు. తదుపరి సమావేశానికి వచ్చే అన్ని రాష్ట్రాల ప్రతినిధులకు తెలంగాణ ఆత్మీయ ఆతిథ్యం అందిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

# ధాన్యం బకాయిలపై కొరడా!

## 20 మంది రైస్ మిల్లర్ల జాబితా ఈడీకి

- ఆస్తులు.. బ్యాంకు లావాదేవీలపై దర్యాప్తునకు నివేదిక
- హవాలా మార్గంలో నిధుల మళ్లింపుపైనా అనుమానాలు
- తొమ్మిది మంది మిల్లర్లపై పీడీ చట్టానికి రంగం సిద్ధం
- బకాయిల వసూలుకు సివిల్ సప్లయ్స్ శాఖ కఠిన చర్యలు



**హైదరాబాద్, ఆగస్టు 20:** ప్రభుత్వ ధాన్యం బకాయిలను భారీగా ఎగవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రైస్ మిల్లర్లపై తెలంగాణ ప్రభుత్వం కొరడా ఝుళిపించేందుకు సిద్ధమవుతోంది. ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో బకాయిపడిన 20 మంది రైస్ మిల్లర్ల వివరాలను సివిల్ సప్లయ్స్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు అందజేసినట్లు సమాచారం. ధాన్యం లావాదేవీలతో పాటు మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం తీసుకున్న కొందరు మిల్లర్లు నిబంధనల ప్రకారం తిరిగి చెల్లించాల్సిన బియ్యం లేదా అందుకు సంబంధించిన బకాయిలను చెల్లించకుండా భారీగా పెండింగ్‌లో పెట్టినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. పలుమార్లు నోటీసులు ఇచ్చినా కొందరి నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో ప్రభుత్వం కఠిన చర్యల దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

### ఆర్థిక లావాదేవీలపై ఈడీ నజర్

ధాన్యం వ్యవహారాల్లో అక్రమ మార్గాల్లో నిధులు సమీకరించారా? ప్రభుత్వానికి చెల్లించాల్సిన సొమ్మును ఇతర వ్యాపారాలకు మళ్లించారా? హవాలా మార్గంలో ఆర్థిక లావాదేవీలు జరిగాయా? అనే అనుమానాలపైనా విచారణ జరపాలని ఈడీకి అందించిన నివేదికలో కోరినట్లు సమాచారం. సంబంధిత మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు లావాదేవీలు, ధాన్యం కొనుగోళ్లు, మిల్లింగ్ రికార్డులను పరిశీలిస్తే అసలు వ్యవహారం వెలుగులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

### తొమ్మిది మందిపై పీడీ చట్టం!

మరోవైపు ప్రభుత్వ బకాయిల విషయంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న తొమ్మిది మంది రైస్ మిల్లర్లపై పీడీ చట్టం ప్రయోగించే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. పలుమార్లు నోటీసులు ఇచ్చినా బకాయిలు చెల్లించకపోవడం, భారీ మొత్తాలను పెండింగ్‌లో ఉంచడం, ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈ దిశగా చర్యలకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ధాన్యం విషయంలో నిర్లక్ష్యం, అక్రమాలకు తావులేకుండా బకాయిలను పూర్తిస్థాయిలో రాబట్టాలన్న లక్ష్యంతో సివిల్ సప్లయ్స్ శాఖ చర్యలను ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. ఈడీ విచారణ మొదలైతే మిల్లర్ల ఆర్థిక లావాదేవీలు, ఆస్తుల వ్యవహారాల్లో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# సుష్మిత వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతం

## కూతురి మాటలకు నన్నెలా బాధ్యురాలిని చేస్తారు?

### ఆమె అభిప్రాయాలతో నాకు సంబంధం లేదు • పార్టీ క్రమశిక్షణపై పూర్తి గౌరవం ఉంది

### నోటీసును వెనక్కి తీసుకోవాలి • క్రమశిక్షణ కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ



**హైదరాబాద్, ఆగస్టు 20:** తన కుమార్తె సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగతమని, వాటికి తనను బాధ్యురాలిని చేయడం సమంజసం కాదని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంటూ టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి గురువారం లేఖ రాశారు. తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. సుష్మిత తన కుమార్తె అయినంత మాత్రాన ఆమె వ్యక్తిగత అభిప్రాయాలకు తాను రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని సురేఖ పేర్కొన్నారు. ఒక వ్యక్తి చేసిన వ్యాఖ్యలకు కుటుంబ సభ్యులను బాధ్యులను చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. తన ప్రమేయం లేని అంశంలో వివరణ కోరడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని సురేఖ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సుష్మిత వ్యాఖ్యల విషయంలో తనకు ఎలాంటి ప్రమేయం లేదన్న విషయాన్ని గుర్తించాలని క్రమశిక్షణ కమిటీని కోరారు. ఈ నేపథ్యంలో తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### సుష్మిత వ్యాఖ్యలతో రచ్చ

వరంగల్ జిల్లా గీసుకొండలో బుధవారం నిర్వహించిన కొండా సురేఖ జన్మదిన వేడుకలకు సుష్మితా పటేల్ హాజరై చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో రాజకీయ దుమారం రేపాయి. వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి పోటీ చేస్తానని, కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని పలు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సుష్మిత వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం కావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా తీసుకుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ దీనిపై నివేదిక కోరగా, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కూడా స్పందించారు. కొండా సురేఖ నుంచి వివరణ కోరతామని ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే సురేఖ క్రమశిక్షణ కమిటీకి లేఖ రాస్తూ.. "సుష్మిత మాటలు ఆమె వ్యక్తిగతం.. వాటికి నన్ను బాధ్యురాలిని చేయొద్దు" అని స్పష్టం చేశారు.

# 22ఏపై రాహుల్‌కు హరీశ్ లేఖ

### తెలంగాణలో సెక్షన్ దుర్వినియోగమంటూ ఆరోపణ

### వేలాది ప్రైవేటు ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని విమర్శ

### రెవెన్యూలో 30 శాతం వసూళ్ల దందా అంటూ ధ్వజం

### పొంగులేటిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్

### స్వతంత్ర విచారణకు ఆదేశించాలని రేవంత్ సర్కారుకు సవాల్



**హైదరాబాద్, ఆగస్టు 20:** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై బీఆర్ఎస్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. 22ఏ సెక్షన్‌ను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించిన ఆయన.. ఈ వ్యవహారంలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో వేలాది ప్రైవేటు ఆస్తులను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చి యజమానులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. సంబంధిత అనుమతులు ఉన్న ఆస్తులను కూడా నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో '30 శాతం వసూళ్ల దందా' సాగుతోందని హరీశ్‌రావు తీవ్ర ఆరోపణలు చేశారు. నిషేధిత జాబితా నుంచి ఆస్తులను తొలగించేందుకు దళారులు 30 శాతం కమీషన్ డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం మౌనం వీడాలని డిమాండ్ చేశారు. 22ఏ వ్యవహారంపై స్వతంత్ర విచారణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఆదేశించాలని హరీశ్‌రావు కోరారు. ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని రాహుల్ గాంధీకి రాసిన లేఖలో హరీశ్‌రావు స్పష్టం చేశారు.



# బావిలోకి దూసుకెళ్లిన కారు.. కుటుంబం బలి

### అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం.. భార్యాభర్తలు.. ఇద్దరు చిన్నారుల మృతి

### సిద్దిపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా విషాదం

**సిద్దిపేట, ఆగస్టు 20:** సిద్దిపేట జిల్లాలో అర్ధరాత్రి ఘోర విషాదం చోటుచేసుకుంది. అదుపుతప్పిన కారు రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో భార్యాభర్తలతో పాటు నాలుగేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. దుబ్బాక మండలం బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి కారులో స్వగ్రామానికి బయలుదేరారు. బుధవారం అర్ధరాత్రి అప్పనపల్లి శివారుకు చేరుకున్న సమయంలో కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో బావిలో పడిపోయిన కారును బయటకు తీశారు. కారులో ఉన్న రాజు, భాగ్య, నిహాన్ష్, శాన్విక మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబంలో భార్యాభర్తలు, ఇద్దరు చిన్నారులు ఒకేసారి మృత్యువాత పడటంతో బలవంతాపూర్‌తో పాటు అప్పనపల్లి ప్రాంతంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



# మంత్రి పొంగులేటి భారీ అవినీతి

### చర్చకు సవాల్ చేసిన బీజేపీ నేత

### మీడియా పాయింట్‌లో మంత్రి కోసం ఎదురుచూపు

**హైదరాబాద్, ఆగస్టు 20:** రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్ర అవినీతి ఆరోపణలు చేశారు. మంత్రి భారీ అవినీతికి పాల్పడ్డారని, అందుకు సంబంధించిన ఆధారాలన్నీ తన వద్ద ఉన్నాయని ప్రకటించారు. తన ఆరోపణలపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరిన ఏలేటి.. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌కు చేరుకుని మంత్రి కోసం ఎదురుచూడటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. పొంగులేటిపై తాను చేస్తున్న ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని ఏలేటి స్పష్టం చేశారు. అవినీతిపై చర్చకు సిద్ధమైతే అసెంబ్లీ మీడియా పాయింట్‌కు రావాలని బుధవారమే సవాల్ చేసిన ఆయన.. గురువారం స్వయంగా అక్కడికి చేరుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కడే ఉంటానని, మంత్రి వచ్చి తన ఆరోపణలకు సమాధానం చెప్పాలని డెడ్‌లైన్ విధించారు. భూభారతి, 22ఏ వ్యవహారాల్లో భారీ అక్రమాలు జరిగాయని ఏలేటి ఆరోపించారు. ఫీనిక్స్, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థలకు సంబంధించిన భూ బదలాయింపులపైనా ఆయన ఆరోపణలు చేశారు. ప్రభుత్వ, ప్రజల భూములను లాక్కున్నారని విమర్శించారు. ఈ వ్యవహారాలపై సీబీఐ విచారణ జరిపించాలని, నిజానిజాలను తేల్చేందుకు హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తన వద్ద ఉన్న ఆధారాలతో చర్చకు సిద్ధంగా ఉన్నానని, మంత్రి పొంగులేటి వచ్చి వివరణ ఇచ్చే వరకు కదిలేది లేదని ఏలేటి తేల్చిచెప్పారు. తన ఆరోపణలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెబుతారా? లేక మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరణ ఇస్తారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌కు ప్రభుత్వం తరఫున ఎవరొచ్చినా తన వద్ద ఉన్న ఆధారాలను అందజేస్తానని ప్రకటించారు. అయితే ఏలేటి చేసిన ఆరోపణలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందన వెలువడాల్సి ఉంది. దీంతో ఆధారాలు బయటపెడతానన్న ఏలేటి సవాల్‌కు మంత్రి ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# ఎర్రబెల్లి కాలువ బాటతో ఉద్రిక్తత

### అడ్డుకుని దేవరుప్పలకు తరలించిన పోలీసులు



**జనగామ, ఆగస్ట్ 20:** మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కాలువ బాట కార్యక్రమంతో జనగామ జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని దేవరుప్పుల, కొడకండ్ల మండలకు సాగు నీరు విడుదల చేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేపట్టిన కాలువ బాటను సింగరాజుపల్లి గ్రామంలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నా చేపట్టారు. తీవ్ర ఉద్రిక్తత నడుమ ధర్నా చేస్తున్న ఎర్రబెల్లిని అరెస్ట్ చేసి దేవరుప్పుల పోలీస్ స్టేషన్ కి తరలించారు. శాంతియుతంగా నిరసన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యంపై బీఆర్ఎస్ తరఫున ఉద్యమిస్తామన్నారు. ఎర్రబెల్లిని భేషరతుగా విడుదల చేయాలని ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కాగా తోపులాటలో ఎర్రబెల్లికి నుదుటికి స్వల్పంగా గాయం కావడంతో పోలీసులు దవాఖానకు తరలించి చికిత్స చేయించారు.

# సిక్కు వ్యతిరేక అల్లర్ల నిందితుడు

### జైలులోనే సజ్జన్ కుమార్ మృతి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 20:** మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. ఢిల్లీలోని తీహార్ జైల్‌లో ఉన్న ఆయనను గురువారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు ఆసుపత్రి వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్తులైన తన బాడీ గార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో సిక్కుల వ్యాపారాలు, నివాససముదాయాలపై దాడులు జరిగాయి. అనేక మంది కన్నుమూశారు. అధికారిక గణాంకాల ప్రకారం, నాటి దాడుల్లో 3 వేల పైచిలుకు మంది కన్నుమూశారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే, ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచారు.

## సంపాదకీయం



# ధరల పెరుగుదలను కంట్రోల్ చేసేదెవరు?

దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుడికి పెనుభారంగా మారుతున్నాయి. బియ్యం నుంచి పప్పుల వరకు, వంటనూనెల నుంచి కూరగాయల వరకు, చివరకు మందుల ధరలు కూడా పెరుగుతున్నాయి. కుటుంబ ఆదాయం అదే స్థాయిలో ఉండగా ఖర్చులు మాత్రం అంతకంతకూ పెరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ ఎజెండాల్లో మునిగిపోతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ధరల పెరుగుదలను నియంత్రించేదెవరు? సామాన్యుడి జేబుకు పడుతున్న చిల్లును పూడ్చేదెవరు? అన్న ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. ప్రధానంగా తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరల పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. సన్నబియ్యం కిలో ధర రూ.80 వరకు పలుకుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగి రూ.100కు చేరుతుందన్న ప్రచారం వినియోగదారులను కలవరపెడుతోంది. వాతావరణ పరిస్థితులు, ఉత్పత్తి తగ్గుదల, రవాణా ఖర్చులు వంటి కారణాలు చెబుతున్నా.. మార్కెట్లో ధరలు ఒక్కసారిగా ఎందుకు పెరుగుతున్నాయి? నిల్వలు ఎంత ఉన్నాయి? కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అన్న అంశాలపై ప్రభుత్వాలు నిరంతర పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది. బియ్యంతోనే సమస్య ముగియడం లేదు. పప్పులు, వంటనూనెలు, ఉప్పు సహా నిత్యావసరాల ధరలు కుటుంబ బడ్జెట్‌ను తలకిందులు చేస్తున్నాయి. కూరగాయల్లో చాలా రకాలు కిలో రూ.60 నుంచి రూ.100 వరకు పలుకుతున్న సందర్భాలు ఉన్నాయి. మందుల ధరలు కూడా పెరుగుతుండటం మధ్యతరగతి, పేద కుటుంబాలకు మరో భారంగా మారుతోంది. ఆహారం, వైద్యం వంటి కనీస అవసరాలే భారంగా మారితే అభివృద్ధి గణాంకాలు సామాన్యుడికి ఎంతవరకు ఊరటనిస్తాయన్నది పాలకులు ఆలోచించాలి.

### రాజకీయాల హోరులో ధరల గోడు

తెలుగు రాష్ట్రాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పర విమర్శలతో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అధికార కూటమి, వైకాపా మధ్య రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి. తెలంగాణలో 22ఏ భూముల వివాదం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ యుద్ధానికి దారితీసింది. భూములు, కమిషన్లు, ప్రభుత్వ వైఫల్యాలపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. జాతీయస్థాయిలోనూ అధికార, ప్రతిపక్షాలు తమ రాజకీయ అంశాల చుట్టూనే చర్చను నడిపిస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ సంస్థాగత వ్యవహారాలు, ఎన్నికల వ్యూహాలు, ప్రత్యర్థులపై విమర్శలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాయో.. ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్న ధరల సమస్యకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నికల సమయంలో ప్రజల ఇంటి బడ్జెట్, ఉపాధి, సంక్షేమం గురించి మాట్లాడే పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అదే శ్రద్ధ చూపాలి.

### గణాంకాలు కాదు.. ఉపశమనం కావాలి

పన్నుల వసూళ్లు పెరిగాయని, ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తోందని చెప్పుకోవడం మాత్రమే సరిపోదు. మార్కెట్‌కు వెళ్లిన సామాన్యుడు తన సంపాదనతో అవసరమైన సరుకులు కొనగలుగుతున్నాడా లేదా అన్నదీ ఆర్థిక ప్రగతికి ముఖ్యమైన కొలమానమే. కిలో బియ్యం కొనడానికి కూడా ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి వస్తే ఆర్థికాభివృద్ధి ఫలాలు కిందిస్థాయి ప్రజలకు చేరుతున్నాయా అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

### మార్కెట్‌ను వ్యాపారుల ఇష్టానికి వదలొద్దు

ధరల నియంత్రణ అంటే వ్యాపారులపై దాడులు చేయడం మాత్రమే కాదు. ఉత్పత్తి నుంచి వినియోగదారుడి వరకు సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేయాలి. ఎక్కడ కొరత ఏర్పడుతోంది, ఎక్కడ అనవసరంగా నిల్వ చేస్తున్నారు, మధ్యవర్తుల వల్ల ధర ఎంత పెరుగుతోంది, రైతుకు లభిస్తున్న ధరకు వినియోగదారుడు చెల్లిస్తున్న ధరకు మధ్య ఎంత వ్యత్యాసం ఉందన్నది ప్రభుత్వాలు పరిశీలించాలి. అవసరమైనప్పుడు నిల్వలను మార్కెట్లోకి విడుదల చేయడం, కృత్రిమ కొరతను అడ్డుకోవడం, రైతుబజార్లు, సహకార విక్రయ కేంద్రాలను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపట్టాలి. ధరల పెరుగుదల కేంద్రానిదా, రాష్ట్రానిదా అని బాధ్యతను ఒకరిపై మరొకరు నెట్టుకోవడం వల్ల సామాన్యుడికి ప్రయోజనం ఉండదు. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేయాలి. నిత్యావసరాల ధరలపై నిరంతర సమీక్షకు ప్రత్యేక వ్యవస్థ ఉండాలి. అవసరమైన వస్తువుల నిల్వలు, సరఫరా, ధరల వివరాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించాలి.

**ఎన్నికల్లో గెలవడం రాజకీయ పార్టీల లక్ష్యం కావచ్చు. కానీ అధికారంలోకి వచ్చాక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే పాలనకు అసలు పరీక్ష. అన్నం, పప్పు, నూనె, కూరగాయలు, మందులు సామాన్యుడికి అందుబాటు ధరల్లో లభించేలా చూడడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. ఇప్పటికైనా రాజకీయ విమర్శల నుంచి కొంత సమయాన్ని ప్రజల వంటింటి వైపు మళ్లించాలి. లేదంటే మార్కెట్ వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారి.. 'ధరలను కంట్రోల్ చేసేదెవరు?' అన్న ప్రశ్న మరింత బలంగా వినిపించడం ఖాయం.**

# రాజీవ్‌కు ఘన నివాళి





- వీర్‌భూమి వద్ద కాంగ్రెస్ అగ్రనేతల అంజలి
- సోనియా, రాహుల్, ఖర్గే, ప్రియాంక నివాళి
- ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ సేవలు చిరస్మరణీయమన్న కాంగ్రెస్
- సామాజిక మాధ్యమం వేదికగా మాజీ ప్రధానిని స్మరించుకున్న మోదీ
- దేశవ్యాప్తంగా సద్భావనా దివస్ కార్యక్రమాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ స్మారక స్థలం వీర్‌భూమిని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు. రాజీవ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని కాంగ్రెస్ పేర్కొంది. దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించడంలో, యువతకు అవకాశాలు కల్పించడంలో ఆయన చూపిన దార్శనికతను గుర్తుచేసుకుంది. వీర్‌భూమి వద్ద నివాళుల కార్యక్రమానికి సంబంధించిన దృశ్యాలను కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రాజీవ్ గాంధీ జయంతిని నిర్వహించాయి. వివిధ ప్రాంతాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతో పాటు దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నాయి.

### రాజీవ్‌ను స్మరించుకున్న మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నట్లు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ జయంతిని ఏటా సద్భావనా దివస్‌గా నిర్వహిస్తారు. జాతీయ ఐక్యత, శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించడం దీని ప్రధాన ఉద్దేశం. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ప్రజల మధ్య ఐక్యతను బలోపేతం చేయడంతో పాటు ఆధునిక, సమ్మిళిత భారత నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయాలన్న రాజీవ్ దార్శనికతను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటారు. ఇందిరాగాంధీ హత్య అనంతరం 1984లో రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టారు. కేవలం 40 ఏళ్ల వయసులో దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి భారత రాజకీయ చరిత్రలో అత్యంత పిన్న వయసులో ప్రధానమంత్రి అయిన నేతగా నిలిచారు.

# వందేమాతరంపై రాజకీయ రగడ

- రెండు చరణాలకే కాంగ్రెస్ మొగ్గు
- కాంగ్రెస్ తీరుపై బీజేపీ ఆగ్రహం
- 'కొత్త ముస్లిం లీగ్' అంటూ నితిన్ ధ్వజం
- ఓటు బ్యాంకు రాజకీయాలంటూ విమర్శలు
- దేశభక్తిపై ప్రశ్నించిన సుధాంశు త్రివేది





**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** జాతీయ గేయం 'వందే మాతరం'పై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ వివాదం మరింత ముదిరింది. పార్టీ కార్యక్రమాల్లో వందే మాతరంలోని తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలన్న 1937 నాటి నిర్ణయానికే కట్టుబడి ఉండాలని కాంగ్రెస్ నిర్ణయించగా, బీజేపీ తీవ్రంగా మండిపడింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కాంగ్రెస్ దేశ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం సమావేశమై వందే మాతరం ఆలాపన విషయంలో 1937 నాటి పార్టీ తీర్మానాన్ని అనుసరించాలని నిర్ణయించింది. ఇకపై పార్టీ కార్యక్రమాల్లో తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని స్పష్టం చేసింది. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందే మాతరం పూర్తి రూపాన్ని ఆలపించే విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

### 'కొత్త ముస్లిం లీగ్'గా కాంగ్రెస్

కాంగ్రెస్ నిర్ణయంపై నితిన్ నబీన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రంగా స్పందించారు. ఓట్ల కోసం కాంగ్రెస్ 'కొత్త ముస్లిం లీగ్'గా మారిందని ఆరోపించారు. వందే మాతరాన్ని అవమానించడం అంటే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను అవమానించడమేనని వ్యాఖ్యానించారు. ఓటు బ్యాంకు కోసం దేశ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ పదేపదే తాకట్టు పెడుతోందని విమర్శించారు. బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది కూడా కాంగ్రెస్‌పై మండిపడ్డారు. స్వాతంత్ర్య ఉద్యమానికి తామే వారసులమని చెప్పుకొనే కాంగ్రెస్ జాతీయ గేయాన్ని పూర్తిగా గౌరవించేందుకు ఎందుకు సిద్ధంగా లేదని ప్రశ్నించారు. వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి ఆ పార్టీ దేశభక్తి, దేశం పట్ల విధేయతపై ప్రశ్నలు లేవనెత్తుతోందని ఆరోపించారు.

### చరిత్రను తెరపైకి తెచ్చిన బీజేపీ

వందే మాతరంపై గతంలో ముస్లిం లీగ్ వ్యక్తం చేసిన అభ్యంతరాలను కూడా బీజేపీ నేతలు ప్రస్తావించారు. అప్పటి వైఖరికి, ప్రస్తుతం కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయానికి పోలికలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ మాత్రం 1937లో తీసుకున్న నిర్ణయాన్నే కొనసాగిస్తున్నామని స్పష్టం చేస్తోంది. దీంతో వందే మాతరం ఆలాపన అంశం మరోసారి జాతీయస్థాయిలో రాజకీయ చర్చకు కేంద్రబిందువైంది.

# పాకిస్థాన్ యాక్షన్.. భారత్ రియాక్షన్!

### ఢిల్లీలో పాక్ హైకమిషన్ వద్ద బారికేడ్ల తొలగింపు
### ట్రాఫిక్ బొల్లార్డ్స్, క్యూలైన్లపైనా వేటు
### ఇస్లామాబాద్ చర్యకు మూడు రోజుల్లోనే ఢిల్లీ బదులు
### 'దెబ్బకు దెబ్బ' చర్యగా దౌత్యవర్గాల్లో చర్చ
### కశ్మీర్‌పై అమెరికా రాయబారి వ్యాఖ్యలతో పాక్ గుర్రు

**న్యూఢిల్లీ:** భారత్-పాకిస్థాన్ మధ్య కొనసాగుతున్న దౌత్య ఉద్రిక్తతల నడుమ మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ వెలుపల పాకిస్థాన్ అధికారులు చేపట్టిన చర్యలకు మూడు రోజుల వ్యవధిలోనే ఢిల్లీలో ప్రతిచర్య కనిపించింది. న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లు, ట్రాఫిక్ బొల్లార్డ్స్, క్యూలైన్ ఏర్పాట్లను భారత అధికారులు తొలగించారు. పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల అనుమతించిన పరిధిని దాటి కొన్ని ఏర్పాట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో వీసా విభాగం సమీపంలోని క్యూలైన్లు, బారికేడ్లు సహా ఇతర ఏర్పాట్లను జేసీబీ సాయంతో తొలగించారు. ఇస్లామాబాద్‌లో భారత హైకమిషన్ వెలుపల పాకిస్థాన్ అధికారులు ఇదే తరహా చర్యలు చేపట్టిన కొద్ది రోజులకే ఢిల్లీలో ఈ పరిణామం చోటుచేసుకోవడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇస్లామాబాద్‌లో భారత హైకమిషన్ వద్ద భద్రతా ఏర్పాట్లను తొలగించిన ఘటనకు ప్రతిచర్యగానే ఢిల్లీలో తాజా చర్యలు చేపట్టారన్న చర్చ సాగుతోంది. 'దెబ్బకు దెబ్బ' అన్న తరహాలో భారత్ స్పందించిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పాకిస్థాన్ చర్యకు ప్రతీకారంగానే బారికేడ్లు తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించలేదు. ఇరుదేశాలు పరస్పరం దౌత్య కార్యాలయాల వద్ద ఏర్పాట్లను తొలగించుకోవడం మాత్రం కొత్త చర్చకు తెరలేపింది.

### కశ్మీర్ వ్యాఖ్యలతో పాక్‌కు మరో మంట

మరోవైపు జమ్మూకశ్మీర్‌పై అమెరికా రాయబారి సెర్జియో గోర్ చేసిన వ్యాఖ్యలు పాకిస్థాన్‌కు ఆగ్రహం తెప్పించాయి. జమ్మూకశ్మీర్ భారత్‌లో ముఖ్యమైన భాగమని పేర్కొన్న ఆయన, కశ్మీర్ లోయలో భద్రతా పరిస్థితులు మెరుగుపడ్డాయని వ్యాఖ్యానించారు. అమెరికా ప్రయాణ హెచ్చరికలను పునఃపరిశీలించే అవకాశముందని కూడా సంకేతాలిచ్చారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన పాకిస్థాన్.. ఇస్లామాబాద్‌లోని అమెరికా ఛార్జ్ డి'అఫైర్స్ నాటలీ బేకర్‌ను విదేశాంగ శాఖకు పిలిపించి నిరసన తెలిపింది. జమ్మూకశ్మీర్ అంశంపై తమ వైఖరిని మరోసారి వెల్లడించింది. దీంతో భారత్-పాక్ దౌత్య ఉద్రిక్తతలకు కశ్మీర్ అంశం కూడా తోడై పరిస్థితి మరింత ఆసక్తికరంగా మారింది.

# విద్యార్థుల కంటే మంత్రి కుక్కలకే మెరుగైన సౌకర్యాలు!

### సర్కారు బడుల దుస్థితిపై అభిజిత్ దీప్కే ఆగ్రహం
### విద్యాశాఖ మంత్రి దాదా భుసే రాజీనామాకు డిమాండ్
### 'ధర్మం కాదు.. పిల్లల భవిష్యత్తే ప్రమాదంలో'
### బడులు బాగుచేయకుంటే నేతలను ఊళ్లలోకి రానివ్వొద్దని పిలుపు
### 2029 ఎన్నికల్లో జెన్ జీ కీలక శక్తిగా మారుతుందని హెచ్చరిక

**లాతూర్, ఆగస్టు 20:** మంత్రులు, ప్రజాప్రతినిధులు పెంచుకునే కుక్కలకు ఉన్న సౌకర్యాలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు లేవని కాక్రోచ్ జనతా పార్టీ కన్వీనర్ అభిజిత్ దీప్కే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహారాష్ట్రలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దయనీయంగా మారిందని, కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. విద్యార్థులను ఇలాంటి పరిస్థితుల్లో చదివిస్తున్నందుకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దాదా భుసే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమంలో భాగంగా లాతూర్ జిల్లా ఔసా తహసీల్‌లోని ఉజని జిల్లా పరిషత్ పాఠశాలను సీజేపీ బృందంతో కలిసి దీప్కే పరిశీలించారు. పాఠశాలలో సరైన తరగతి గదులు, బెంచీలు, మరుగుదొడ్లు, ఇతర కనీస వసతులు లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రేకుల కప్పుల నుంచి నీరు కారడం, పాఠశాల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం, అపరిశుభ్ర వాతావరణంతో ఆవరణలు పాములకు నిలయాలుగా మారుతున్నాయని ఆరోపించారు. పాముకాటు ఘటనల్లో పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నా అధికార యంత్రాంగంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించలేని నాయకులకు ప్రజలు ఎందుకు ఓటేయాలని దీప్కే ప్రశ్నించారు. కేవలం హెలికాప్టర్లలో తిరిగేందుకే నాయకులకు ప్రజలు ఓట్లు వేస్తున్నారా అంటూ నిలదీశారు. 'ధర్మం ప్రమాదంలో ఉంది' అంటూ రాజకీయాలు చేసే నేతలు ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో ఉందన్న విషయాన్ని గుర్తించాలని హితవు పలికారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తేనే అక్కడి వాస్తవ పరిస్థితులు వారికి అర్థమవుతాయని అన్నారు. పాఠశాలలను బాగుచేసే వరకు ఓట్ల కోసం వచ్చే నాయకులను గ్రామాల్లోకి రానివ్వకూడదని ప్రజలకు పిలుపునిచ్చారు.

### 2029లో జెన్ జీ దెబ్బ చూపిస్తుంది

2029 ఎన్నికల నాటికి జెన్ జీ యువత కీలకమైన ఎన్నికల శక్తిగా అవతరిస్తుందని దీప్కే హెచ్చరించారు. యువత, విద్యార్థుల సమస్యలను రాజకీయ పార్టీలు పరిష్కరించకపోతే ఎన్నికల్లో మూల్యం చెల్లించక తప్పదన్నారు. పాఠశాలల్లో కనీస సౌకర్యాలను తక్షణమే మెరుగుపరచకపోతే గ్రామాల వారీగా పెద్దఎత్తున నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. లాతూర్ నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసుపైనా దీప్కే స్పందించారు. దర్యాప్తు కిందిస్థాయి నిందితులకే పరిమితమవుతోందని, పెద్ద తలకాయలను కాపాడే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఉన్నతస్థాయి అధికారుల ప్రమేయం లేకుండా ఇంత పెద్ద వ్యవహారం జరగడం సాధ్యం కాదని, అసలు బాధ్యులను బయటకు తీసుకొచ్చేలా సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

# అడవికి టెక్నాలజీ కవచం!

- కర్ణాటక తరహాలో అటవీ నిఘా వ్యవస్థ
- ప్రతి అంగుళంపై డిజిటల్ నిఘా
- ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్



ఆంధ్రప్రదేశ్‌లో అటవీ పరిరక్షణకు అత్యాధునిక సాంకేతిక వ్యవస్థను తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారు. కర్ణాటక అటవీ శాఖ తరహాలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి అడవిలో ప్రతి అంగుళాన్ని కేంద్రం నుంచే పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అటవీ మ్యాపింగ్‌తో పాటు వన్యప్రాణుల కదలికలు, అటవీ కార్యకలాపాలు, గస్తీ, వాహనాల రాకపోకలపై డిజిటల్ నిఘా ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల రాష్ట్ర అటవీశాఖ ఐటీ సలహాదారు పెన్నమరెడ్డి నాగబాబు ఆధ్వర్యంలోని బృందం కర్ణాటకలో మూడు రోజుల పాటు పర్యటించి అక్కడ అమలవుతున్న ఐటీ, జీఐఎస్, మొబైల్ అప్లికేషన్లు, కమాండ్ సెంటర్ విధానాలను అధ్యయనం చేసింది. ఆ నివేదికను పరిశీలించిన పవన్ కళ్యాణ్ విజయవంతమైన విధానాలను ఏపీలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

## డ్రోన్లు, కెమెరాలతో వన్యప్రాణుల ట్రాకింగ్

కొత్త కమాండ్ సెంటర్ ద్వారా అనేక వ్యవస్థలను ఒకే చోట నుంచి పర్యవేక్షించే అవకాశం కలగనుంది. జియోస్పేషియల్ డ్యాష్‌బోర్డులు, డ్రోన్ ఆధారిత నిఘా, కెమెరా ట్రాప్‌ల ద్వారా వన్యప్రాణుల సంఖ్య, కదలికల విశ్లేషణ చేపట్టనున్నారు. అటవీ మార్గాల్లో ప్రయాణించే వాహనాల ట్రాకింగ్, గస్తీ బృందాల పర్యవేక్షణ, అటవీ అగ్నిప్రమాదాల గుర్తింపు, మానవ-వన్యప్రాణి ఘర్షణలపై నిరంతర నిఘా పెట్టనున్నారు. అటవీ సరిహద్దుల డిజిటలైజేషన్ ప్రక్రియ ఇప్పటికే రాష్ట్రంలో కొనసాగుతోందని పవన్ తెలిపారు. కేంద్ర మార్గదర్శకత్వంలో చేపడుతున్న ఈ ప్రక్రియతో అటవీ భూముల సరిహద్దులకు చట్టబద్ధమైన రక్షణ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మానవ-వన్యప్రాణి ఘర్షణల నివారణకు ఏఐ ఆధారిత ప్రమాద అంచనా వ్యవస్థలు, వన్యప్రాణుల సంచార డ్యాష్‌బోర్డులు కూడా సిద్ధం చేసినట్లు వివరించారు.

## కర్ణాటకతో టెక్నాలజీ భాగస్వామ్యం

అటవీ పరిరక్షణలో కర్ణాటక అనుభవాన్ని మరింతగా ఉపయోగించుకోవాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధం వంటి అంశాల్లో ఇప్పటికే ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందాలు ఉన్నాయని పవన్ కళ్యాణ్ తెలిపారు. ఇకపై సాంకేతిక పరిజ్ఞానం మార్పిడికి ప్రత్యేకంగా సంయుక్త వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు. పత్రాల మార్పిడి, అవసరమైన చోట సోర్స్‌కోడ్ భాగస్వామ్యం, జీఐఎస్‌లో ఉత్తమ విధానాల మార్పిడి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థలపై శిక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. అటవీ సంరక్షణలో ఆధునిక సాంకేతికతను పూర్తిస్థాయిలో ఉపయోగించి జవాబుదారీతనం పెంచడం ఈ చర్యల ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం భావిస్తోంది.

# తగ్గుతున్న వృద్ధి..

- కోర్ సెక్టార్లకు జులైలో బ్రేకులు!
- 6 నుంచి 5.4 శాతానికి డౌన్ ఫాల్



దేశ ఆర్థిక కార్యకలాపాలకు కీలకంగా ఉండే ఎనిమిది కోర్ సెక్టార్ల వృద్ధి జులై 2026లో కొంత మందగించింది. జూన్‌లో 6 శాతంగా ఉన్న వృద్ధి జులైలో 5.4 శాతానికి తగ్గింది. కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ గురువారం విడుదల చేసిన ఇండెక్స్ ఆఫ్ కోర్ ఇండస్ట్రీస్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. వృద్ధి తగ్గినా జులై గణాంకం గత ఏడు నెలల్లో రెండో అత్యంత వేగవంతమైన వృద్ధి కావడం కొంత ఊరటనిచ్చే అంశం. ఎరువులు, ఇనుప ఖనిజం, ఉక్కు రంగాల్లో వృద్ధి మందగించడం ప్రధాన కారణంగా నిలిచింది. మరోవైపు సహజ వాయువు, ముడి చమురు రంగాలు వరుసగా క్షీణించడం పారిశ్రామిక రంగంపై ఒత్తిడిని పెంచింది. కొత్త సిరీస్‌తో కోర్ ఇండస్ట్రీస్ సూచీని జులైలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో పాత గణాంకాలతో చారిత్రక పోలిక జూన్ 2025 వరకు మాత్రమే సాధ్యమవుతుంది.

## ఎరువులు, ఉక్కు రంగాల్లో మందగమనం

ఎరువుల రంగం జులైలో 8 శాతం క్షీణించింది. జూన్‌లో ఈ రంగం 3.3 శాతం తగ్గగా, గత ఏడాది జులైలో 1.9 శాతం వృద్ధి నమోదైంది. బలహీనంగా, అసమానంగా కొనసాగుతున్న రుతుపవనాలు, తక్కువ స్థాయిలో సాగు ప్రారంభం కావడం ఎరువుల డిమాండ్‌పై ప్రభావం చూపినట్లు భావిస్తున్నారు. ఇనుప ఖనిజం వృద్ధి జూన్‌లో 44.5 శాతం నుంచి జులైలో 29.5 శాతానికి తగ్గింది. అయితే గత ఏడాది ఇదే సమయంలో రంగం తీవ్రంగా పడిపోవడంతో ఈ ఏడాది వృద్ధిలో తక్కువ బేస్ ప్రభావం ఉంది. బొగ్గు రంగం కూడా 7.6 శాతం వృద్ధితో 11 నెలల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఉక్కు రంగం మాత్రం జూన్‌లో 5.6 శాతం వృద్ధి నుంచి జులైలో కేవలం 2.9 శాతానికి పడిపోయింది. ఇది కొత్త సిరీస్‌లో ఇప్పటివరకు నమోదైన అత్యల్ప వృద్ధి.

## చమురు క్షీణత.. సిమెంట్ విద్యుత్ ఊరట

సహజ వాయువు, ముడి చమురు రంగాల పరిస్థితి మాత్రం ఆందోళన కలిగిస్తోంది. జులైలో సహజ వాయువు ఉత్పత్తి 3.7 శాతం, ముడి చమురు ఉత్పత్తి 5.3 శాతం క్షీణించాయి. ఈ రెండు రంగాలు అందుబాటులో ఉన్న గత 14 నెలల గణాంకాల్లో వరుసగా క్షీణతను నమోదు చేస్తున్నాయి. రిఫైనరీ ఉత్పత్తుల రంగం మాత్రం మూడు నెలల వరుస క్షీణతకు తెరదించి జులైలో 2.7 శాతం వృద్ధి సాధించింది. పారిశ్రామిక రంగానికి ప్రధాన ఊరటనిచ్చినవి సిమెంట్, విద్యుత్ రంగాలు. విద్యుత్ ఉత్పత్తి 9 శాతం పెరిగింది, అయితే జూన్‌లో నమోదైన 11.4 శాతంతో పోలిస్తే ఇది తక్కువ. సిమెంట్ రంగం 13.1 శాతం వృద్ధితో ఏడు నెలల గరిష్ఠాన్ని అందుకుంది. మొత్తంగా చూస్తే కోర్ సెక్టార్లలో వృద్ధి ఇంకా కొనసాగుతున్నా, కీలక రంగాల్లో మందగమనం దేశ పారిశ్రామిక వేగంపై జాగ్రత్త సంకేతాలను ఇస్తోంది.

# ఇంటింటికీ తెలుగుదేశం

- ప్రజా సమస్యలపై ఆరా
- బైపాస్‌లో మాజీ ఎమ్మెల్యే పర్యటన

ప్రొద్దుటూరులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి గురువారం టూ టౌన్ బైపాస్ ప్రాంతంలో పర్యటించారు. సంజీవనగర్ క్రాస్ నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని లింగారెడ్డి హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు అభినందిస్తూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కామిశెట్టి బాబు, టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు శామీర్ భాషా, టప్పా మహబూబ్ భాషా, జిల్లెళ్ల వెంకటేష్, కదిరి రామకృష్ణారెడ్డి, ద్వార్శల వెంకటరెడ్డి, గిద్దలూరు ఈశ్వరయ్య, మహమ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



# దక్షిణాది అభివృద్ధికి చంద్రబాబు బిగ్ ప్లాన్

- సీఎంల సమక్షంలో కీలక ప్రతిపాదనలు



మహాబలిపురంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏపీ సీఎం చంద్రబాబుతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ సీఎంలు, పుదుచ్చేరి ప్రతినిధులు హాజరయ్యారు. దక్షిణాది రాష్ట్రాల సమగ్ర అభివృద్ధిపై చంద్రబాబు పలు కీలక ప్రతిపాదనలు చేశారు. రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టులు ఏర్పాటు చేయడంతో పాటు దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం చేయాలని కోరారు.

## నీటి సమస్యకు నదుల అనుసంధానం

దక్షిణాది రాష్ట్రాల మధ్య జలవనరులపై సమన్వయం అవసరమని చంద్రబాబు స్పష్టం చేశారు. గోదావరి-కావేరి అనుసంధానం ద్వారా తమిళనాడు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందన్నారు. కావేరి నదుల అనుసంధానంతో 500 టీఎంసీలకు పైగా నీటిని మళ్లించే ప్రతిపాదనను ప్రస్తావించారు. గంగా-కావేరి అనుసంధానానికి దీర్ఘకాలిక జాతీయ ప్రణాళిక రూపొందించాలని కోరారు. నదుల అనుసంధాన ప్రాజెక్టులకు కాలపరిమితితో కూడిన డీపీఆర్‌లు, అనుమతులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కలిసి జల సమస్యలపై ముందుకు సాగాలని సూచించారు.

## 10 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం

దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందని చంద్రబాబు తెలిపారు. 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరే అవకాశం ఉందన్నారు. విపత్తుల సమయంలో పరస్పర సహకారం కోసం మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్, విద్యా సంస్థలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని సూచించారు. తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్‌ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థల విభజన 12 ఏళ్లుగా పూర్తి కాలేదని గుర్తుచేశారు. చంద్రబాబు ప్రసంగాన్ని కర్ణాటక సీఎం డీకే శివకుమార్ ప్రశంసిస్తూ, దక్షిణాది అభివృద్ధిపై ఆయన విశాల దృక్పథంతో మాట్లాడారని పేర్కొన్నారు.

# ఎంక్వయిరీపై జగన్ కొర్రి..

- సీబీఐపై తేల్చుకోలేక టీడీపీ వర్రీ
- జగన్ సవాల్‌తో రాజకీయాల్లో హీట్
- జగన్ సవాల్.. చంద్రబాబుకు కొత్త చిక్కు



డీఎస్సీ-2025 పరీక్షల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు, గ్రూప్-1 పరీక్షపై ప్రభుత్వం చేస్తున్న విమర్శలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో కొత్త వివాదానికి దారితీశాయి. వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబుకు నేరుగా సవాల్ విసిరారు. గ్రూప్-1 పరీక్షపై సీబీఐ విచారణకు తాము సిద్ధమని, అదే సమయంలో డీఎస్సీ-2025పై కూడా సీబీఐ విచారణకు ప్రభుత్వం సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. డీఎస్సీలో తప్పు జరగకపోతే ప్రభుత్వం విచారణకు ఎందుకు భయపడుతోందని జగన్ ప్రశ్నించారు. తమ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1లో ఎలాంటి అక్రమాలు జరగలేదని, అందుకే విచారణను ఎదుర్కొనేందుకు తమకు ఎలాంటి భయం లేదని స్పష్టం చేశారు. రెండు వ్యవహారాలపై ఒకే విధమైన దర్యాప్తు జరిగితే అసలు వాస్తవాలు బయటకు వస్తాయని అన్నారు.

## డీఎస్సీపై జగన్ లేవనెత్తిన ప్రశ్నలు

డీఎస్సీ-2025 నిర్వహణలో ప్రశ్నపత్రం తయారీ, పరీక్ష నిర్వహణ బాధ్యతలు ఒకే అధికారి చేతిలో ఉండటం ప్రధాన అనుమానంగా జగన్ ప్రస్తావించారు. సాధారణంగా ప్రశ్నపత్రం తయారీ, పరీక్ష నిర్వహణకు వేర్వేరు బాధ్యతలు ఉండాలని, అలా చేస్తేనే చెక్స్ అండ్ బ్యాలెన్స్ ఉంటుందని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి నవీన్ ప్రశ్నపత్రాల తయారీలో భాగమై ఉండి, ఒక కేటగిరీలో ఫస్ట్ ర్యాంక్ సాధించినా, మొదటి మెరిట్ జాబితాలో ఉన్న అతని పేరు రెండో జాబితాలో తొలగించడంపై జగన్ ప్రశ్నలు సంధించారు. ఐడీ బ్లాక్ చేసి, కాల్ లెటర్ పంపకపోతే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు అతను ఎలా హాజరవుతాడని ప్రశ్నించారు. పరీక్ష రాయకుండానే స్పోర్ట్స్ కోటాలో 372 మందికి ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రత్యేక జీఓలు జారీ చేసి, తరువాత వాటిని రద్దు చేసి కొత్త జీఓలు తీసుకురావడం కూడా అనుమానాలకు తావిస్తోందని అన్నారు.

## బేరసారాల ఆరోపణలపై తీవ్ర విమర్శలు

డీఎస్సీ ఉద్యోగాల పేరుతో బేరసారాలకు సంబంధించిన ఆడియో, వీడియోలు బయటకు వచ్చినట్లు ప్రభుత్వం అసెంబ్లీలోనే అంగీకరించిందని జగన్ పేర్కొన్నారు. ఫోన్ నెంబర్ స్పష్టంగా ఉన్నప్పటికీ సంబంధిత వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. మరో ఘటనలో డీఎస్సీ ఉద్యోగం కోసం రూ.14.10 లక్షలు చెల్లించినట్లు రాధిక అనే యువతి ఆధారాలతో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు చర్యలు లేవని అన్నారు. బేరసారాలపై ఫిర్యాదులను వేరే శాఖ పోస్టులకు సంబంధించినవిగా మార్చి నమోదు చేశారని ఆరోపించారు. ప్రశ్నపత్రం తయారీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పాత్ర, మెరిట్ జాబితా మార్పులు, పరీక్ష లేకుండా ఉద్యోగాలు, ప్రత్యేక జీఓలు, బేరసారాల ఆరోపణలు ఇలా అనేక అంశాలు ఉన్నందున సమగ్ర దర్యాప్తు అవసరమని జగన్ చెప్పారు. డీఎస్సీ వ్యవహారంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు.

## గ్రూప్–1పై జగన్ వాదన ఇదే

గ్రూప్-1 వ్యవహారంపై చంద్రబాబు చేస్తున్న ఆరోపణలను జగన్ తీవ్రంగా ఖండించారు. గ్రూప్-1 నోటిఫికేషన్, ప్రిలిమినరీ పరీక్ష చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. 2019 మే 26న ప్రిలిమ్స్ జరిగాయని, మే 30న తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించి, హైకోర్టు ఆదేశాల ప్రకారం మెయిన్స్ పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి 163 మందిని ఎంపిక చేశామని తెలిపారు. కోవిడ్ సమయంలో డిజిటల్ మూల్యాంకనంపై నిర్ణయం తీసుకున్నా, హైకోర్టు ఆదేశాల తరువాత మాన్యువల్ మూల్యాంకనం చేశామని చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో మూల్యాంకనం జరిగిందని, సిట్ నివేదికలోనూ జవాబు పత్రాలు, ఓఎంఆర్ షీట్లు, జీఆర్ఎల్‌లో ట్యాంపరింగ్ జరగలేదని వెల్లడైందని జగన్ పేర్కొన్నారు. 2025 నవంబర్ 14న ప్రభుత్వం హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లోనూ అక్రమాలు జరగలేదని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

## సీబీఐ విచారణే తుది సవాల్

గ్రూప్-1పై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు లేవని జగన్ అన్నారు. అభ్యర్థుల జవాబు పత్రాలకు బార్‌కోడ్ విధానం ఉండటం, మూల్యాంకనంలో చీఫ్ ఎగ్జామినర్లు, స్క్రుటినైజర్లు, సూపర్‌వైజర్లు వంటి పలు దశల పర్యవేక్షణ ఉండటం వల్ల అక్రమాలకు అవకాశం లేదని వివరించారు. తమ హయాంలో ఏపీపీఎస్సీలో ఫేషియల్ రికగ్నిషన్, థంబ్ ఇంప్రెషన్, పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, మూడు ఇంటర్వ్యూ బోర్డులు వంటి మార్పులు తీసుకొచ్చామని చెప్పారు. డీఎస్సీ-2025తో పాటు గ్రూప్-1 2018పైనా సీబీఐ విచారణకు తాము సిద్ధమని, చంద్రబాబు కూడా సిద్ధమా అని ప్రశ్నించారు. డీఎస్సీ అక్రమాలపై ఇప్పటికే కోర్టును ఆశ్రయించామని, ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రికి తమ పార్టీ ఎంపీల ద్వారా వినతిపత్రాలు ఇచ్చామని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ డీఏలు, పీఆర్సీ, సీపీఎస్ హామీలపైనా చంద్రబాబు ప్రభుత్వాన్ని జగన్ విమర్శించారు. సర్వీస్ టీచర్లకు టెట్ నిబంధనను వ్యతిరేకించారు. మొత్తంగా డీఎస్సీ-2025, గ్రూప్-1 రెండు వ్యవహారాలపై సీబీఐ విచారణ జరిపితేనే ఎవరి వాదనలో నిజం ఉందో తేలుతుందని జగన్ స్పష్టం చేశారు.

# స్థానిక పోరుకు పవన్ పక్కా వ్యూహం!

- జనసేన శ్రేణులకు కొత్త దిశానిర్దేశం
- పోరాట స్ఫూర్తితో స్థానిక ఎన్నికలు



స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. జనసైనికులు, వీర మహిళలు గతంలో ఎదుర్కొన్న ఒత్తిళ్లు, దాడులను గుర్తు చేసుకుంటూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ఈసారి ఎన్నికల్లో బలంగా నిలవాలని ఆయన సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో నామినేషన్లు వేసేందుకు కూడా ఇబ్బందులు ఎదురైన పరిస్థితుల్లో జనసేన కార్యకర్తలు ధైర్యంగా పోటీ చేశారని పవన్ గుర్తుచేశారు. 2021 స్థానిక ఎన్నికల్లో శ్రేణులు చూపిన పోరాట స్ఫూర్తి, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి అందించిన సహకారం కీలకమని పేర్కొన్నారు. ఈసారి స్థానిక ఎన్నికల్లో పార్టీ శక్తిసామర్థ్యాలను మరింత పెంచి మెరుగైన ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు.

### 21 సీట్ల వ్యూహం.. స్థానిక ఎన్నికలకు కాదు

జనసేన 2024 సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయడం వెనుక ప్రత్యేక రాజకీయ వ్యూహం ఉందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఆ వ్యూహం కేవలం సార్వత్రిక ఎన్నికలకే పరిమితమని, స్థానిక ఎన్నికల్లో అదే విధానం కొనసాగదని తెలిపారు. ప్రతి ప్రాంతంలోని రాజకీయ, సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పోటీ చేసే స్థానాలను నిర్ణయిస్తామని చెప్పారు. జనసేన ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు మాత్రమే పరిమితం కాకుండా, పరిసర ప్రాంతాల్లోనూ పార్టీ బలాబలాలను అంచనా వేసి జనసేనకు అనుకూలంగా ఉన్న స్థానాలను గుర్తించి కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తామని పవన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో కూటమి ధర్మానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారన్న శ్రేణుల అసంతృప్తిని కూడా పార్టీ పరిగణనలోకి తీసుకుంటుందని స్పష్టం చేశారు.

### 11 మందితో ప్రత్యేక కమిటీ

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన విధివిధానాలు రూపొందించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. 9 నుంచి 11 మంది సభ్యులతో ఈ కమిటీ ఏర్పాటు కానుంది. ఇందులో పార్టీ ఎమ్మెల్యేలతో పాటు సీనియర్ నాయకులకు చోటు కల్పించనున్నారు. క్షేత్రస్థాయి కార్యకర్తల ఆలోచనలు, స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలాబలాలను పరిగణనలోకి తీసుకుని కమిటీ ఎన్నికల వ్యూహాన్ని రూపొందించనుంది. పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని పవన్ హామీ ఇచ్చారు. జనసేన నాయకులు, కార్యకర్తలకు రాజకీయంగా మెరుగైన అవకాశాలు కల్పిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గురువారం అసెంబ్లీ ప్రాంగణంలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో జరిగిన జనసేన శాసనసభాపక్ష సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, నాగబాబు, రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేష్, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు పాల్గొని స్థానిక ఎన్నికల కార్యాచరణపై చర్చించారు.

# అసెంబ్లీకి రండి..

- పరీక్షలపై తేల్చుకుందాం!
- ట్వీట్‌తో జగన్‌పై లోకేశ్ ఫైర్
- డీఎస్సీ ఏంటో చెప్పగలరా?



ఆంధ్రప్రదేశ్‌లో పరీక్షల వ్యవస్థపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి నారా లోకేశ్ ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. "ముందుగా మీ నాయకుడిని డీఎస్సీ అంటే ఏమిటి? ఏపీపీఎస్సీ అంటే ఏమిటి? ఈ రెండింటి మధ్య తేడా ఏమిటో చెప్పమని అడగండి" అంటూ ఎక్స్ వేదికగా సవాల్ చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ రెండూ ఒకటేనన్నట్లుగా జగన్ మాట్లాడుతున్నారని లోకేశ్ ఎద్దేవా చేశారు. పరీక్షల వ్యవస్థపై కనీస అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

## ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు

జగన్ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని లోకేశ్ తీవ్ర విమర్శలు చేశారు. అధికారంలో ఉన్న సమయంలో ఉపాధ్యాయ నియామక పరీక్ష నిర్వహించలేకపోయారని ఆరోపించారు. ఇప్పుడు పరీక్షల విధానం గురించి ప్రశ్నలు లేవనెత్తడం విడ్డూరంగా ఉందన్నారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా తెలియని పరిస్థితి జగన్ పాలనలో నిరుద్యోగులకు ఎలాంటి న్యాయం జరిగిందనే ప్రశ్నను లేవనెత్తుతోందని వ్యాఖ్యానించారు.

## చర్చకు రాకుండా పారిపోతున్నారా?

"అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ నిర్వహించలేకపోయారు.. ఇప్పుడు అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోతున్నారు" అంటూ లోకేశ్ మరోసారి జగన్‌ను టార్గెట్ చేశారు. పరీక్షల వ్యవస్థపై నిజమైన అవగాహన ఉంటే అసెంబ్లీ వేదికగా చర్చకు రావాలని సవాల్ విసిరారు. జగన్ వ్యాఖ్యలకు సమాధానంగా పెట్టిన ఈ ట్వీట్ రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. విద్యా నియామకాలు, పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం-వైసీపీ మధ్య మాటల యుద్ధం మరింత ముదురుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

# భార్య చితి దగ్గరే భర్త తుదిశ్వాస!

- చివరి చూపులోనే విడిచిన ప్రాణం
- ఒకరి మరణం.. మరొకరి గుండె ఆగింది




నంద్యాల జిల్లా ఆత్మకూరులో చోటుచేసుకున్న విషాదం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. శ్రీరామ్‌నగర్‌లో నివసించే లక్ష్మీదేవి, సుబ్బరాయుడు దంపతులు జీవితాంతం ఒకరికొకరు తోడుగా నిలిచారు. అనారోగ్యంతో లక్ష్మీదేవి కన్నుమూయడంతో కుటుంబం ఒక్కసారిగా విషాదంలో మునిగిపోయింది. భార్యను కోల్పోయిన బాధతో సుబ్బరాయుడు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కన్నీటి మధ్య భార్య అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆమెకు చివరి వీడ్కోలు పలుకుతుండగా.. భర్త మాత్రం ఆ విషాదాన్ని తట్టుకోలేకపోయారు. భార్య చితి వద్ద అంత్యక్రియలు జరుగుతుండగానే సుబ్బరాయుడికి ఒక్కసారిగా గుండెపోటు వచ్చినట్లు సమాచారం. వెంటనే ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు ప్రయత్నించినా.. అప్పటికే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

## చావులోనూ విడిపోని అనుబంధం

కొద్ది సేపటి క్రితం భార్యకు అంతిమ వీడ్కోలు పలికిన కుటుంబ సభ్యులే.. వెంటనే భర్తను కూడా కోల్పోవడంతో అక్కడి విషాదం మరింత విషాదంగా మారింది. ఒకే రోజు భార్యాభర్తలు ఇద్దరూ మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. జీవితంలో ఎన్నో కష్టసుఖాల్లో కలిసి నడిచిన ఆ దంపతులు చివరికి కూడా ఒకరిని విడిచి మరొకరు ఎక్కువ కాలం ఉండలేకపోయారంటూ స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. భార్య మృతితో కలత చెందిన భర్తకు గుండెపోటు రావడం కుటుంబ సభ్యులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒక్కరోజులో రెండు మరణాలను చూడాల్సి రావడంతో బంధువులు విషాదంలో మునిగిపోయారు. జీవితంలో తోడుగా నిలిచిన ఆ ఇద్దరూ.. మరణంలోనూ కలిసిపోయారన్న భావన శ్రీరామ్‌నగర్ వాసులను కదిలించింది. ఈ ఘటనతో ఆత్మకూరులోని శ్రీరామ్‌నగర్‌లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



# ఫిర్యాదులకు కమిషనర్ స్పందన

- ఫోన్‌కాల్‌తో సమస్యల పరిష్కారం

ప్రొద్దుటూరు పురపాలక సంఘం నిర్వహిస్తున్న "కమిషనర్‌తో ముఖాముఖి" ఫోనింగ్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నాలుగు వారాలుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 71 ఫిర్యాదులు అందగా, వీటిలో 30 సమస్యలను ఇప్పటికే పరిష్కరించారు. ప్రధానంగా మంచినీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్యం, రోడ్లు, ఆక్రమణలు, ట్రాఫిక్, ఆవులు, కుక్కలకు సంబంధించిన సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. 27 జూలై 2026 నుంచి వరుసగా నాలుగు వారాల పాటు ఫోనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్లడించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించామని చెప్పారు. మిగిలిన ఫిర్యాదులపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా స్వీకరించి, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు కొత్తవి కావు. కానీ అధికారం చేతిలో ఉన్న సమయంలో అవి బహిరంగ విమర్శలుగా మారడం ఇప్పుడు పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన ఘాటు వ్యాఖ్యలు ఈ అసంతృప్తికి తాజా ఉదాహరణగా నిలిచాయి. ఆగస్టు 19న గీసుకొండలో కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా మాట్లాడిన సుస్మిత, రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ సంస్కృతి అబ్బలేదని, పచ్చ కాంగ్రెస్ మాత్రమే నడుస్తోందని ఆరోపించారు. టీడీపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నేతలకు ప్రాధాన్యం ఇస్తున్నారని, అసలు కాంగ్రెస్ నేతలకు స్థానం తగ్గుతోందని అన్నారు. ప్రస్తుత పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని సీఎం పిలుపునివ్వడాన్ని ఆమె ప్రశ్నించారు. ఎమ్మెల్యే టికెట్లు పార్టీ అధిష్ఠానం నిర్ణయించాలి తప్ప ముఖ్యమంత్రి కాదని వ్యాఖ్యానించారు. తాను పరకాల నుంచి పోటీ చేస్తానని, పార్టీ టికెట్ ఇచ్చినా ఇవ్వకపోయినా బరిలో ఉంటానని ప్రకటించడం వివాదాన్ని మరింత పెంచింది. గత ఎన్నికల సమయంలో తమ కుటుంబం రేవూరి గెలుపు కోసం పనిచేసిందని, తన తండ్రి కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చి తర్వాత మర్చిపోయారని ఆరోపించారు. బీసీ ఎమ్మెల్యేలకు సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని, మంత్రులు సంతకాలు చేసిన పనులు కూడా ముందుకు సాగడం లేదని విమర్శించారు. అంతటితో ఆగకుండా సీఎం కుటుంబంపై భూముల కేటాయింపు, అవినీతి ఆరోపణలతో కూడిన తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. కౌంటర్ ఇస్తే మరిన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించడం ద్వారా ఇది సాధారణ అసంతృప్తి కాదని స్పష్టమైంది. ఈ వ్యాఖ్యలే ఇప్పుడు కాంగ్రెస్‌లో క్రమశిక్షణ, అధికార సమీకరణాలు, పరకాల టికెట్ పోరు, పాత–కొత్త నేతల మధ్య ఆధిపత్య పోరును ఒకేసారి తెరపైకి తెచ్చాయి.





# కాంగ్రెస్ కు క్లిష్ట పరిస్థితులు

- పతాక స్థాయికి అసమ్మతి చిచ్చు
- హస్తం పార్టీలో కొండంత అసమ్మతి
- అధినాయకత్వంపై నేతల్లో అవిశ్వాసం

## అచ్చు.. పచ్చుపై రచ్చు రచ్చు..

## గ్రూపుల పంచాయితీతో కాంగ్రెస్‌కు మచ్చ

**• సురేఖ వివరణతో కొత్త మలుపు**

సుస్మిత వ్యాఖ్యలపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. మంత్రి పదవిలో ఉన్నందునే ఆమె నుంచి వివరణ కోరామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, వివరణ వచ్చిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని కమిటీ ఆదేశించడంతో, సురేఖ ఏం చెబుతారన్నది ఆసక్తిగా మారింది. ఈ నేపథ్యంలో ఆమె క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవికి లేఖ పంపించి తన వైఖరిని స్పష్టం చేశారు. ఆగస్టు 19న తన జన్మదినం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కొండా కుటుంబ అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు కార్యక్రమాలు నిర్వహించారని, తన స్వస్థలం గీసుకొండతో కుమార్తె సుస్మితకు ఉన్న అనుబంధం కారణంగా అక్కడి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారని వివరించారు. అయితే సుస్మిత చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని, వాటితో తనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. స్వతంత్ర వ్యక్తిగా కుమార్తె తన అభిప్రాయాలను వ్యక్తం చేసిందని, కుటుంబ బంధం కారణంగా ఆమె మాటలకు తల్లిని రాజకీయంగా బాధ్యురాలిని చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు పూర్తి గౌరవం ఉందని చెబుతూ, ఈ వ్యవహారంలో తన ప్రమేయం లేదని గుర్తించి నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు. దీంతో అసలు ప్రశ్న సుస్మితపై చర్య ఉంటుందా, లేక తల్లి వివరణతో వ్యవహారం ముగుస్తుందా అన్నదిగా మారింది. ఒకవైపు పార్టీ క్రమశిక్షణను కాపాడాల్సిన అవసరం, మరోవైపు మంత్రి ఇచ్చిన వాదన మధ్య అధిష్ఠానం నిర్ణయం కీలకంగా మారింది.

**• పరకాల టికెట్ రగడే అసలు మంట**

ఈ మొత్తం వివాదానికి రాజకీయ కేంద్ర బిందువు పరకాల నియోజకవర్గమే. వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ టికెట్ కోసం పోటీ ఇప్పుడే మొదలైంది. సీఎం రేవంత్‌రెడ్డి పరకాల పర్యటనలో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చిన తర్వాత కొండా కుటుంబం నుంచి ప్రతిస్పందన వచ్చింది. సుస్మిత తాను పరకాల నుంచి పోటీ చేస్తానని బహిరంగంగా ప్రకటించడంతో రేవూరి వర్సెస్ కొండా కుటుంబం పోటీ స్పష్టమైంది. ఇదే నియోజకవర్గంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి కూడా తాను లేదా తన సతీమణి ఎన్నికల్లో పోటీ చేస్తామని చెప్పడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది. అంటే కాంగ్రెస్‌లో పరకాల టికెట్ కోసం కనీసం మూడు వర్గాల ఆసక్తి కనిపిస్తోంది. ఈ పోరు ఒక్కరోజులో మొదలైనది కాదు. 2024 మేలో గీసుకొండ కాంగ్రెస్ నాయకుడి వ్యవహారంపై సురేఖ, రేవూరి మధ్య ఫోన్ సంభాషణ ఆడియో లీక్ కావడం అప్పట్లో కలకలం రేపింది. అదే ఏడాది అక్టోబర్‌లో ధర్మారంలో దసరా ఫ్లెక్సీ వివాదం రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతకు దారి తీసింది. 2025 డిసెంబర్ పంచాయతీ ఎన్నికల్లో గీసుకొండ మండలంలో కాంగ్రెస్ గెలిచిన 16 స్థానాల్లో కొండా వర్గానికి ఏడు, రేవూరి వర్గానికి తొమ్మిది స్థానాలు రావడం కూడా స్థానిక బలాబలాలకు సంకేతంగా కనిపించింది. 2026 మార్చి 3న కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతర సందర్భంగా సుస్మిత పరకాల నుంచి పోటీ సంకేతాలు ఇవ్వడం, కొండా మురళి ఆమెకు మద్దతుగా కుటుంబాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరడం కూడా ఈ పోరుకు ముందస్తు సంకేతాలుగా నిలిచాయి. ఇప్పుడు ఆగస్టు 19 వ్యాఖ్యలతో ఆ పాత పంచాయితీ బహిరంగ యుద్ధంగా మారింది.

**• ముందు నుయ్యి వెనుక గొయ్యి**

పార్టీకి ఇప్పుడు అవసరమైంది ఎవరి వ్యక్తిగత గౌరవాన్ని తగ్గించడం కాదు, సమన్వయానికి కొత్త పద్ధతి తీసుకురావడం. ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయాలు తీసుకున్నప్పుడు స్థానిక నేతలతో ముందుగానే మాట్లాడటం, సీనియర్లకు గౌరవం ఇవ్వడం, కార్యకర్తలకు పదవులపై స్పష్టత ఇవ్వడం, నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయ నాయకత్వంపై నిర్ణయాలను సమయానికి ప్రకటించడం అవసరం. అదే సమయంలో నాయకులు కూడా ప్రభుత్వంపై ఆరోపణలు ఉంటే ఆధారాలతో పార్టీ అంతర్గత వేదికల్లో చెప్పాలి. బహిరంగంగా పరస్పర ఆరోపణలు చేసుకోవడం వల్ల చివరకు నష్టపోయేది వ్యక్తులు కాదు, మొత్తం పార్టీ. ఈ సందేశం ఇప్పుడు కాంగ్రెస్‌లో ప్రతి వర్గానికీ చేరాల్సిన అవసరం ఉంది. ఇలాంటి సమన్వయం లేకపోతే స్థానిక ఎన్నికలు, భవిష్యత్ అసెంబ్లీ టికెట్లు, ప్రభుత్వ పదవుల పంపకం సమయంలో విభేదాలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. అందుకే ఈ వివాదాన్ని ముగించడం మాత్రమే కాకుండా దాని నుంచి పాఠం నేర్చుకోవడం నాయకత్వానికి కీలకం. లేకపోతే అసమ్మతి ఒక్కో నియోజకవర్గంలో కొత్త ముఖంతో బయటపడుతుంది. అధికారం బలంగా ఉన్నప్పుడే అంతర్గత అసంతృప్తిని పరిష్కరించకపోతే ఎన్నికల సమయానికి అది నియంత్రణలో లేని సంక్షోభంగా మారొచ్చు. ఇదే కాంగ్రెస్ భవిష్యత్ రాజకీయానికి అసలు పరీక్షగా నిలుస్తుంది.



**• పాత కాంగ్రెస్ వర్సెస్ కొత్త కాంగ్రెస్**

కొండా వివాదం ఒక్క కుటుంబానికి పరిమితం కాదు. తెలంగాణ కాంగ్రెస్‌లో పాత నేతలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల మధ్య ప్రాధాన్యం, పదవులు, రాజకీయ భవిష్యత్తుపై అసంతృప్తి చాలాకాలంగా కనిపిస్తోంది. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఫిరాయింపుల ద్వారా వచ్చిన నేతలకు కీలక స్థానాలు దక్కుతున్నాయన్న భావన కొంతమంది ఒరిజినల్ కాంగ్రెస్ నేతల్లో ఉంది. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఆలస్యం అవుతున్నాయని ఆశావహులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో టికెట్లను ముందుగానే ప్రకటించుకోవడం, ప్రభుత్వ నిర్ణయాలపై బహిరంగంగా మాట్లాడటం, వ్యక్తిగత పంచాయితీలను పార్టీ వేదికపైకి తీసుకురావడం పెరుగుతోంది. వనపర్తిలో సీనియర్ నేత చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్గాల మధ్య విభేదాలు గాంధీభవన్ వరకు వెళ్లాయి. చిన్నారెడ్డి చేసిన ఆరోపణలకు మేఘారెడ్డి సవాల్ విసరడం కూడా పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఇదే సమయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మధ్య బహిరంగ విమర్శలు, ఇతర నేతల వ్యాఖ్యలు కూడా అధిష్ఠానానికి క్రమశిక్షణ సమస్యను గుర్తుచేశాయి. బాన్సువాడ ఎమ్మెల్యే, సీనియర్ నేత పోచారం శ్రీనివాస్‌రెడ్డి అసంతృప్తిపై మహేశ్‌గౌడ్ స్పందిస్తూ ఆయనతో మాట్లాడామని, సీనియర్ నేతలకు తగిన ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. నామినేటెడ్ పదవుల్లో సీనియర్ కాంగ్రెస్ నేతలకు 70 శాతం వరకు అవకాశం కల్పించే చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. పాత-కొత్త నేతలను కలిపి పార్టీని బలోపేతం చేస్తామని కూడా స్పష్టం చేశారు. ఈ పరిణామాలు చూస్తే ప్రతి జిల్లాలో స్థానిక రాజకీయ సమీకరణాలు, వ్యక్తిగత వర్గాలు, టికెట్ ఆశలు, పదవుల పోటీ కలిసి కాంగ్రెస్ అంతర్గత రాజకీయాన్ని నడుపుతున్నట్టు కనిపిస్తోంది.

**• సీఎం రేవంత్ ఇప్పుడేం చేస్తారు?**

పార్టీలో ఎవరైనా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకోబోమన్న సందేశాన్ని టీపీసీసీ స్పష్టంగా ఇస్తోంది. మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ విధానాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని, పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సుస్మిత వ్యాఖ్యలు బాధాకరమని, తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. మంత్రి సురేఖకు నోటీసు ఇవ్వడానికి ఆమె ప్రభుత్వంలో మంత్రిగా ఉండటం కూడా కారణమని వివరించారు. అదే విధానం చిన్నారెడ్డి వంటి సీనియర్ నేతల విషయంలోనూ వర్తిస్తుందని స్పష్టం చేశారు. పార్టీ అభ్యర్థులను ఎవరూ ముందుగానే ప్రకటించినా అవి చెల్లుబాటు కావని చెప్పారు. అయితే సుస్మితపై మహిళా కాంగ్రెస్ నేత ఇందిరా శోభన్ చేసిన తీవ్ర విమర్శలు వివాదానికి మరో కోణం తెచ్చాయి. సుస్మిత మాటలు జాగ్రత్తగా ఉండాలని, రాజకీయాల్లో పార్టీ లైన్‌లో పనిచేయాలని ఆమె సూచించారు. కొండా కుటుంబంతో బంధాన్ని గౌరవిస్తున్నప్పటికీ, సుస్మిత ప్రవర్తన సరైంది కాదని అన్నారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలు పదవులు కోరడం సమంజసమని, తన రాజకీయ సేవ ఏమిటో చెప్పకుండా ఎమ్మెల్యే పదవి కోరడం ప్రశ్నార్థకమని వ్యాఖ్యానించారు. మరోవైపు పార్టీపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంలో వివక్ష ఉందన్న చర్చ కూడా వినిపిస్తోంది. ఇలాంటి ఆరోపణలు నిజమా కాదా అన్నది పక్కన పెడితే, ప్రతి నేతకు ఒకే ప్రమాణం వర్తింపజేయడం కాంగ్రెస్ నాయకత్వానికి అత్యవసరంగా మారింది. లేదంటే చర్యలు తీసుకున్న ప్రతిసారి కొత్త అసంతృప్తి పుట్టే ప్రమాదం ఉంది. అందుకే రేవంత్‌రెడ్డి, పీసీసీ నాయకత్వం ముందు ఉన్న అసలు సవాలు ఒక్క సుస్మిత వ్యవహారాన్ని పరిష్కరించడం కాదు... బహిరంగ విమర్శలకు ముగింపు పలికేలా అంతర్గతంగా పార్టీలో చర్చల ప్రక్రియ ప్రారంభించాలి.

**• కొండా వివాదం దాటి అసలు పరీక్ష**

ఇప్పుడు కొండా సురేఖ ఇచ్చిన వివరణతో బంతి క్రమశిక్షణా కమిటీ కోర్టులో ఉంది. సురేఖ మాటలను పరిగణనలోకి తీసుకుని నోటీసు ఉపసంహరిస్తారా, లేక మంత్రి పదవిలో ఉన్న నాయకురాలిగా కుటుంబ సభ్యుడి వ్యాఖ్యలకు రాజకీయ బాధ్యత ఉందని భావించి తదుపరి చర్యలు తీసుకుంటారా అన్నది చూడాలి. అయితే ఏ నిర్ణయం తీసుకున్నా దాని ప్రభావం కొండా కుటుంబం, రేవూరి వర్గం దాటి మొత్తం తెలంగాణ కాంగ్రెస్‌పై పడే అవకాశం ఉంది. సుస్మితపై నేరుగా చర్య తీసుకుంటే ఆమె స్వతంత్ర రాజకీయ పోరాటానికి మరింత ఊపొచ్చే అవకాశం ఉంది. సురేఖను కూడా శిక్షిస్తే కుటుంబం, పార్టీ మధ్య దూరం పెరగొచ్చు. నోటీసును పూర్తిగా ఉపసంహరిస్తే మాత్రం పార్టీ క్రమశిక్షణపై నాయకత్వం ఇంతకాలం ఇచ్చిన హెచ్చరికల విశ్వసనీయత దెబ్బతినే ప్రమాదం ఉంది. మరోవైపు సుస్మిత తన భవిష్యత్ రాజకీయ లక్ష్యాన్ని పరకాల టికెట్‌తో బహిరంగంగా అనుసంధానించడంతో, వచ్చే ఎన్నికలకు ముందే అక్కడ కాంగ్రెస్‌లో వర్గపోరు ముదిరే సూచనలు కనిపిస్తున్నాయి. దీనికి తోడు వనపర్తి, నల్లగొండ, ఇతర జిల్లాల్లోని అసంతృప్తి కూడా కలిస్తే సమస్య ఒక కుటుంబం నుంచి పార్టీ నిర్మాణ సమస్యగా మారుతుంది. ప్రతిపక్షాల విమర్శలను ఎదుర్కొంటున్న ప్రభుత్వానికి సొంత పార్టీ నేతల బహిరంగ ఆరోపణలు అదనపు రాజకీయ భారంగా మారుతున్నాయి. రెండున్నరేళ్ల పాలన తర్వాత కూడా వర్గపోరు తగ్గకపోవడం ఎందుకు అనే ప్రశ్న ఇప్పుడు కాంగ్రెస్‌లోనే వినిపిస్తోంది.

**• ఇన్ ఫ్రంట్ క్రోకోడైల్ ఫెస్టివల్**

పదవుల కోసం ఎదురుచూస్తున్న పాత నేతలకు న్యాయం చేయడం, కొత్తగా వచ్చిన నేతలకు స్థానం కల్పించడం, నామినేటెడ్ పోస్టుల భర్తీని వేగవంతం చేయడం, టికెట్ విషయంలో ముందస్తు ప్రకటనలకు అడ్డుకట్ట వేయడం, ప్రతి వర్గాన్ని ఒకే క్రమశిక్షణ కిందకు తీసుకురావడం అత్యవసరం. కొండా సురేఖ వివరణపై నిర్ణయం ఈ పెద్ద రాజకీయ ప్రక్రియకు తొలి పరీక్ష మాత్రమే. అసలు పరీక్ష మాత్రం రేవంత్-హైకమాండ్ కలిసి కాంగ్రెస్‌ను వర్గాల పార్టీగా కాకుండా ఒకే రాజకీయ బృందంగా నిలబెట్టగలరా అన్నదే. ఇక్కడ మరో కీలక అంశం అధికారంలో ఉన్న పార్టీకి వచ్చే మానసిక మార్పు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేతలు తమ అసంతృప్తిని బహిరంగంగా చెప్పినా అది పోరాటంగా కనిపిస్తుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే మాటలు ప్రభుత్వ నిర్ణయాలపై అవిశ్వాసంగా, నాయకత్వంపై తిరుగుబాటుగా, ప్రత్యర్థులకు ఆయుధంగా మారుతాయి. అందుకే కాంగ్రెస్‌లో ప్రస్తుతం ప్రతి మాటకు రాజకీయ బరువు పెరిగింది. మంత్రి కుటుంబ సభ్యురాలు చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియా, ప్రతిపక్ష రాజకీయాల్లో వేగంగా ప్రచారం కావడం కూడా నాయకత్వాన్ని అప్రమత్తం చేసింది. ఇదే సమయంలో అసంతృప్తి వెనుక ఉన్న వాస్తవ కారణాలను గుర్తించకుండా కేవలం నోటీసులు, హెచ్చరికలతో సమస్యను ముగించలేమన్న అభిప్రాయం కూడా ఉంది. టికెట్ ఆశలు, నియోజకవర్గ ఆధిపత్యం, ప్రభుత్వంలో ప్రాధాన్యం, అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్, వ్యక్తిగత సంబంధాలు వంటి అంశాలు చిన్న మంటలను పెద్ద వివాదాలుగా మారుస్తున్నాయి. ఈ సమస్యలకు రాజకీయ చర్చ ద్వారా పరిష్కారం చూపితేనే భవిష్యత్తులో ఇలాంటి పేలుళ్లను తగ్గించవచ్చు. లేదంటే ప్రతి నియోజకవర్గంలో ఒక కొత్త కొండా పంచాయితీ తెరపైకి వచ్చే ప్రమాదం ఉంటుంది.

## ఇంకా చాలా ఉంది

**అధికార కాంగ్రెస్‌కు అసమ్మతి సెగ**

అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ కాంగ్రెస్‌లో విభేదాలు మరింత బహిరంగంగా మారుతున్నాయి. పాత కాంగ్రెస్ నేతలు, ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల మధ్య ఆధిపత్య పోరు, పదవుల కోసం అసంతృప్తి, టికెట్ల ముందస్తు పోటీ పార్టీకి కొత్త సమస్యలు తెస్తున్నాయి. నేతల వ్యక్తిగత విభేదాలు ఇప్పుడు పార్టీ వ్యవహారాలుగా మారుతుండటంతో నాయకత్వానికి పరిస్థితులు క్లిష్టంగా మారుతున్నాయి.

**కొండా కుటుంబంతో ముదిరిన పంచాయితీ**

మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన ఘాటు వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో పెద్ద దుమారం రేపాయి. పచ్చ కాంగ్రెస్ అంటూ విమర్శించడంతో పాటు పరకాల నుంచి తానే పోటీ చేస్తానని ప్రకటించారు. ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి సీఎం మద్దతు ఇవ్వడాన్ని ఆమె ప్రశ్నించడంతో కొండా వర్సెస్ రేవూరి పాత విభేదాలు మళ్లీ తెరపైకి వచ్చాయి.

**సురేఖ వివరణతో ఉత్కంఠ**

సుస్మిత వ్యాఖ్యలకు సంబంధించి మంత్రి కొండా సురేఖకు పీసీసీ క్రమశిక్షణా కమిటీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. దీనిపై స్పందించిన సురేఖ, తన కుమార్తె వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యుల అభిప్రాయాలకు రాజకీయంగా తనను బాధ్యురాలిని చేయడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ క్రమశిక్షణపై తనకు పూర్తి గౌరవం ఉందని చెబుతూ నోటీసును ఉపసంహరించుకోవాలని కోరారు.

**అచ్చ కాంగ్రెస్ వర్సెస్ పచ్చ కాంగ్రెస్**

సుస్మిత చేసిన అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ వ్యాఖ్యలు పార్టీలో ఉన్న అసలు అంతర్గత సమస్యను బయటపెట్టాయి. ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు ప్రాధాన్యం పెరుగుతోందన్న భావన పాత కాంగ్రెస్ నేతల్లో అసంతృప్తికి కారణమవుతోంది. నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులు, టికెట్ల విషయంలో తమకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్న ఆవేదన కూడా బహిరంగ విమర్శలకు దారితీస్తోంది.

**రేవంత్ ముందున్న అసలు సవాల్**

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. అయితే కేవలం నోటీసులు, హెచ్చరికలతో సమస్య పరిష్కారం కాదన్న అభిప్రాయం కూడా ఉంది. సీనియర్లకు ప్రాధాన్యం, పాత-కొత్త నేతల సమన్వయం, నామినేటెడ్ పదవుల భర్తీ, టికెట్ పోరుకు ముందస్తు నియంత్రణ అవసరం. కాంగ్రెస్‌ను వర్గాల పార్టీగా కాకుండా ఏకతాటిపై నడపడం రేవంత్ ముందున్న అసలు పరీక్ష.



- నెల్లూరు పెద్దారెడ్డి కాదు..
పుంగనూరు పెద్దిరెడ్డి ఇక్కడ!
- చిత్తూరు గాంధీ రోడ్డా.. లేక
తిరుపతి లీలామహల్ సెంటరా..!
- స్పాట్ నువ్వు చెప్పినా సరే.. టైం నన్ను
చెప్పమన్నా సరే.. దేనికైనా రెఢీ..
- ఉమ్మడి చిత్తూరులో పెద్దిరెడ్డి..
నారావారి హైఓల్టేజ్ ఛాలెంజ్

# పెద్దింటి కనుసన్నల్లో.. ఉమ్మడి చిత్తూరు జిల్లా..

## నారావారి చాణక్యంతో రసకందాయంలో రాజకీయ ఖిల్లా

**ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయాలు ఎప్పుడూ సాదాసీదాగా ఉండవు. తిరుమల కొండలంత ఎత్తైన రాజకీయ ప్రతిష్ఠ.. పుంగనూరు రాజకీయాలంత వేడి.. కుప్పం అంత బలమైన కోట.. చంద్రగిరి అంత ఉత్కంఠ.. తిరుపతి అంత వైవిధ్యం.. ఇవన్నీ కలిసిన రాజకీయ భూభాగం ఇది. ఇక్కడ ఓటరు ఒకసారి ఒక పార్టీకి పట్టం కడితే శాశ్వతంగా అదే పార్టీ వెంట నడుస్తాడని చెప్పలేం. నాయకుడి వ్యక్తిగత ప్రభావం, సామాజిక సమీకరణాలు, ప్రభుత్వ పనితీరు, అభ్యర్థి వ్యక్తిత్వం.. ఇవన్నీ కలిసే ఎన్నికల తీర్పును నిర్ణయిస్తాయి. అందుకే 2019లో చిత్తూరు జిల్లా దాదాపు మొత్తం వైసీపీ రంగులో కనిపిస్తే.. ఐదేళ్లు తిరగకముందే 2024లో దృశ్యం పూర్తిగా మారిపోయింది. 2019లో 14లో 13 స్థానాలు వైసీపీ గెలుచుకుంటే.. 2024లో కూటమి 12 స్థానాలు కైవసం చేసుకుంది. తంబళ్లపల్లె, పుంగనూరు మాత్రమే వైసీపీకి మిగిలాయి. ఇదే ఇప్పుడు 2029 రాజకీయాలకు అసలు పునాది.**

### 2024.. ఒక్క ఎన్నిక.. మొత్తం లెక్క మారింది

2019లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వైసీపీకి దాదాపు క్లీన్‌స్వీప్ ఇచ్చింది. తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి 1,05,444 ఓట్లతో 46,938 మెజారిటీ సాధించారు. గంగాధర నెల్లూరులో కె. నారాయణస్వామి 45,594 మెజారిటీతో గెలిచారు. సత్యవేడులో కోనేటి ఆదిమూలం 44,744, పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 43,555, చంద్రగిరిలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 41,755 ఓట్ల మెజారిటీలు సాధించారు. శ్రీకాళహస్తి, చిత్తూరు, పలమనేరు, పూతలపట్టు వంటి నియోజకవర్గాల్లోనూ వైసీపీ అభ్యర్థులు గణనీయమైన ఆధిక్యాలతో గెలిచారు. అయితే ఈ మహా ప్రవాహంలోనూ ఒక కొండ మాత్రం కదల్లేదు. అదే కుప్పం. నారా చంద్రబాబునాయుడు 2019లో 1,00,146 ఓట్లతో గెలిచి 30,722 ఓట్ల మెజారిటీ సాధించారు. అంటే 2019లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఒకవైపు వైసీపీ సముద్రం అయితే.. మరోవైపు కుప్పం రూపంలో టీడీపీ ద్వీపం నిలిచింది. 2024లో రాజకీయ గాలి పూర్తిగా మారిపోయింది. తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి 94,136 ఓట్లతో గెలిచినా మెజారిటీ 10,103కు తగ్గింది. పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి 1,00,793 ఓట్లతో గెలిచినా మెజారిటీ 6,095కు పరిమితమైంది. మరోవైపు పీలేరులో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి 25,081 మెజారిటీ, చంద్రగిరిలో పులివర్తి వెంకట మణిప్రసాద్ 43,852, శ్రీకాళహస్తిలో బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి 43,304, నగరిలో గాలి భానుప్రకాష్ 45,004 మెజారిటీలు సాధించారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఏకంగా 61,956 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కుప్పంలో చంద్రబాబు 48,006 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. దీంతో 2019లో 13-1గా ఉన్న లెక్క 2024లో 12-2గా మారింది. ఇది సాధారణ అధికార మార్పు కాదు.. చిత్తూరు రాజకీయాల్లో వచ్చిన పెద్ద రాజకీయ పునర్వ్యవస్థీకరణ.

### పెద్దిరెడ్డి.. ఒక నాయకుడు కాదు.. ఒక రాజకీయ వ్యవస్థ

చిత్తూరు రాజకీయాలను అర్థం చేసుకోవాలంటే పుంగనూరును అర్థం చేసుకోవాలి. పుంగనూరును అర్థం చేసుకోవాలంటే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అర్థం చేసుకోవాలి. పెద్దిరెడ్డి కుటుంబం రాజకీయంగా ఎదిగిన తీరు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రత్యేక అధ్యాయం. పుంగనూరు కేంద్రంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన రాజకీయ ప్రభావాన్ని బలపరచుకున్నారు. తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి విజయం కూడా కుటుంబ ప్రభావాన్ని మరింత విస్తరించింది. 2019లో ఆ బలం సునామీలా కనిపించింది. 2024లో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ తీవ్ర పరాజయం పొందినా.. పుంగనూరు, తంబళ్లపల్లెలను నిలబెట్టుకోవడం పెద్దిరెడ్డి రాజకీయ బలానికి ఒక సూచన. అయితే అదే సమయంలో రెండు నియోజకవర్గాల్లో మెజారిటీలు భారీగా తగ్గడం కూడా మరో సంకేతం. అంటే కోట గోడలు ఇంకా ఉన్నాయి.. కానీ పాతంత బలంగా లేవనే రాజకీయ చర్చకు ఇది కారణమైంది.

### చూసుకుందామా.. చంద్రబాబు?

చిత్తూరు అంటే నారా కుటుంబానికి కేవలం ఒక జిల్లా కాదు. కుప్పం అంటే చంద్రబాబుకు కేవలం ఒక నియోజకవర్గం కాదు. అది ఆయన రాజకీయ గుర్తింపు. కుప్పం నుంచి వరుస విజయాలు సాధిస్తూ చంద్రబాబు రాష్ట్ర రాజకీయాల్లో తన స్థానాన్ని బలోపేతం చేసుకున్నారు. 2019లో వైసీపీ 13 స్థానాలు గెలిచినా కుప్పాన్ని మాత్రం టీడీపీ కోల్పోలేదు. 2024లో చంద్రబాబు కుప్పంలో మరింత బలమైన తీర్పు సాధించారు. 1,21,929 ఓట్లు, 48,006 మెజారిటీ ఆయనకు లభించాయి. అందుకే కుప్పం చంద్రబాబుకు సవాల్ కంటే ఆయన బలానికి కొలమానం. కానీ 2029లో అసలు ప్రశ్న కుప్పం ఎవరిది అన్నది మాత్రమే కాదు. కుప్పం నుంచి మొత్తం ఉమ్మడి చిత్తూరు రాజకీయాన్ని టీడీపీ ఎంతవరకు ప్రభావితం చేస్తుందన్నదే అసలు ప్రశ్న.

### చిత్తూరు గాంధీరోడ్డా.. తిరుపతి లీలామహల్ సెంటరా?

చిత్తూరు నగరం రాజకీయంగా ఒక ప్రత్యేక కేంద్రం. తిరుపతి మరో ప్రత్యేక కేంద్రం. చిత్తూరు పట్టణ రాజకీయాల్లో వ్యాపార, మధ్యతరగతి, ఉద్యోగ వర్గాల ప్రభావం కనిపిస్తే.. తిరుపతి రాజకీయాల్లో ఆధ్యాత్మిక ఆర్థిక వ్యవస్థతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వర్గాలు, స్థానిక ఓటర్లు వంటి అనేక అంశాలు కలిసిపోతాయి. 2024లో తిరుపతిలో జనసేనకు చెందిన ఆరణి శ్రీనివాసులు 1,24,107 ఓట్లతో ఏకంగా 61,956 మెజారిటీ సాధించారు. 2019లో కేవలం 708 ఓట్లతో వైసీపీ గెలిచిన తిరుపతిలో ఐదేళ్లలో ఇంత భారీ మార్పు రావడం చిత్తూరు రాజకీయాల్లో ఓటరు తీర్పు ఎంత వేగంగా మారగలదో చూపించింది. అందుకే 2029లో తిరుపతి మరోసారి కీలకమైన రాజకీయ కేంద్రంగా మారడం ఖాయం.

### చంద్రగిరి, నగరి, తంబళ్లపల్లె.. ఎవరి తర్వాత ఎవరు?

చంద్రగిరి రాజకీయంగా ఎప్పటి నుంచో ఆసక్తికరమైన నియోజకవర్గం. 2019లో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 41,755 మెజారిటీతో గెలిచారు. 2024లో అదే నియోజకవర్గంలో పులివర్తి వెంకట మణిప్రసాద్ 1,43,667 ఓట్లతో 43,852 మెజారిటీ సాధించారు. ఇది కేవలం అధికార మార్పు కాదు. ఓటరు తన తీర్పును ఎంత వేగంగా మార్చగలడో చూపించిన ఉదాహరణ. 2029లో చంద్రగిరి ఫలితం రాష్ట్ర రాజకీయ పరిశీలకులకు ముఖ్యమైన సూచికగా మారే అవకాశం ఉంది. నగరి కూడా సాధారణ నియోజకవర్గం కాదు. ఆర్.కె. రోజా వ్యక్తిగత రాజకీయ ఇమేజ్‌తో ఈ నియోజకవర్గం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు వచ్చింది. 2019లో ఆమె కేవలం 2,708 ఓట్ల మెజారిటీతో గెలిచారు. అంటే అప్పుడే నగరి హైకాంపిటీషన్ సీటు. 2024లో గాలి భానుప్రకాష్ 1,07,797 ఓట్లతో 45,004 మెజారిటీ సాధించారు. ఇది 2029లో మరోసారి రాజకీయ పోరాటానికి వేదిక కావచ్చు. ఇక్కడ పార్టీ కంటే నాయకుడి వ్యక్తిగత ప్రభావం కీలకంగా ఉండే అవకాశం ఉంది. తంబళ్లపల్లె 2019లో వైసీపీకి 46,938 మెజారిటీ ఇచ్చింది. 2024లో అదే స్థానంలో మెజారిటీ 10,103కు పడిపోయింది. అంటే ఓటరు పూర్తిగా వైసీపీని వదిలిపెట్టలేదు. కానీ పాత స్థాయిలో కూడా పట్టుకోలేదు. 2029లో తంబళ్లపల్లె అందుకే పెద్దిరెడ్డి కుటుంబానికి అత్యంత ముఖ్యమైన పరీక్ష. ఇక్కడ వైసీపీ తన మెజారిటీని తిరిగి పెంచుకోగలిగితే పెద్దిరెడ్డి ప్రభావం ఇంకా బలంగానే ఉందని చెప్పవచ్చు. లేకపోతే 2024లో కనిపించిన పగుళ్లు 2029 నాటికి పెద్ద రాజకీయ మార్పుగా మారే అవకాశం ఉంటుంది.

### పెద్దిరెడ్డి వర్సెస్ నారా.. కానీ మధ్యలో ఓటరు

2024లో తిరుపతి జనసేనకు దక్కడం చిత్తూరు రాజకీయాల్లో కొత్త అధ్యాయం. ఇది కేవలం ఒక సీటు కాదు. జనసేనకు తిరుపతి ఒక రాజకీయ ప్రయోగశాల. ఇక్కడ పార్టీ తన సంస్థాగత బలాన్ని పెంచుకుంటే 2029లో కూటమిలో సీట్ల పంపకాల్లో మరింత ప్రాధాన్యం రావచ్చు. అదే సమయంలో టీడీపీతో సమన్వయం, స్థానిక నాయకుల మధ్య పోటీ, సీట్ల పంపకం వంటి అంశాలు కూడా ఫలితాలను ప్రభావితం చేస్తాయి. జనసేన తన బలాన్ని తిరుపతి దాటి ఇతర నియోజకవర్గాలకు విస్తరించగలిగితే ఉమ్మడి చిత్తూరు రాజకీయ సమీకరణాల్లో మరో శక్తికేంద్రం ఏర్పడుతుంది. చిత్తూరు రాజకీయాలను కేవలం పెద్దిరెడ్డి వర్సెస్ నారా అనే కోణంలో చూడటం కూడా పూర్తిస్థాయి విశ్లేషణ కాదు. ఎందుకంటే చివరికి నిర్ణయం తీసుకునేది నాయకులు కాదు.. ఓటరు. నాయకులు సమీకరణాలు కడతారు. పార్టీలు పొత్తులు పెట్టుకుంటాయి. అభ్యర్థులు ప్రచారం చేస్తారు. కానీ చివరి రోజు ఈవీఎంలో బటన్ నొక్కేది ఓటరే. 2019లో 13-1గా తీర్పు ఇచ్చిన అదే ఓటరు 2024లో 12-2గా తీర్పు ఇచ్చాడు. అంటే చిత్తూరు ఓటరు ఒక పార్టీకి శాశ్వత బానిస కాదు. పరిస్థితులను బట్టి తీర్పు మార్చగలడు. అందుకే 2029లో గెలుపు కోసం పెద్దిరెడ్డి కుటుంబం తమ కోటలను కాపాడుకోవాలి. నారా కుటుంబం తమ కోటలను విస్తరించాలి. జనసేన తన ప్రభావాన్ని పెంచుకోవాలి. వైసీపీ తన పునర్నిర్మాణాన్ని వేగవంతం చేయాలి.

### స్పాట్ నువ్వు చెబుతావా.. టైం నన్ను చెప్పమంటావా?

ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా చూస్తే కుప్పం టీడీపీకి అత్యంత బలమైన స్థానంగా కనిపిస్తుంది. పుంగనూరు పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రధాన కోట. తంబళ్లపల్లె వైసీపీకి నిలిచిన మరో కేంద్రం. తిరుపతి జనసేనకు కీలక స్థావరం. చంద్రగిరి పోటీకి సిద్ధమైన యుద్ధభూమి. నగరి వ్యక్తిగత నాయకత్వానికి పరీక్ష. పీలేరు, మదనపల్లె, శ్రీకాళహస్తి, సత్యవేడు, గంగాధర నెల్లూరు, చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు నియోజకవర్గాల్లో 2029లో ప్రభుత్వ పనితీరు, అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలే ఫలితాలను నిర్ణయించే అవకాశం ఉంది. అందుకే 2029లో మళ్లీ 12-2 లెక్క వస్తుందని ఇప్పుడే చెప్పడం ఎంత తొందరో.. వైసీపీ తిరిగి 13-1 చేస్తుందని చెప్పడం కూడా అంతే తొందర. ఇదే చిత్తూరు రాజకీయాల అసలు మజా. ఎక్కడ పోటీ జరుగుతుందో నాయకులు చెబుతారు. ఎప్పుడు గాలి మారుతుందో ఓటరు చెబుతాడు. 2019లో 13-1.. 2024లో 12-2. ఈ రెండు తీర్పుల మధ్యే చిత్తూరు ఓటరు రాజకీయ స్వభావం కనిపిస్తుంది. ఒకసారి వైసీపీకి దాదాపు మొత్తం జిల్లా అప్పగించిన ఓటరు.. ఐదేళ్ల తర్వాత అదే స్థాయిలో కూటమికి మద్దతు ఇచ్చాడు. అంటే చిత్తూరు ఓటరు పార్టీకి శాశ్వత బంధీ కాదు. తనకు నచ్చిన నాయకుడికి, తనకు ఉపయోగపడతారని భావించిన అభ్యర్థికి, తన సమస్యలు పరిష్కరిస్తారని నమ్మిన పార్టీకే ఓటు వేస్తాడు. చివరగా.. ఉమ్మడి చిత్తూరు జిల్లా రాజకీయ కథను ఒక్క మాటలో చెప్పాలంటే.. ఇది కోటల జిల్లా.. కానీ కోటలు కూడా ఓటరుతోనే నిలబడతాయి. కుప్పం నారావారి కోట కావచ్చు. పుంగనూరు పెద్దిరెడ్డి కోట కావచ్చు. తంబళ్లపల్లె మరో కుటుంబ ప్రభావానికి కేంద్రం కావచ్చు. తిరుపతి జనసేన ప్రయోగశాల కావచ్చు. కానీ 2029లో ఈ కోటలన్నింటికీ జవాబు మాత్రం ఓటరు చేతిలోనే ఉంటుంది. ఉమ్మడి చిత్తూరులో పెద్దిరెడ్డి-నారావారి సవాల్ ఇప్పుడే మొదలైంది. 2024లో కూటమి గెలిచింది. 2026లో కూటమి ఆధిక్యంలో ఉంది. కానీ 2029లో ఎవరి జెండా ఎగురుతుందో చెప్పేది చిత్తూరు రాజకీయ నాయకులు కాదు.. చిత్తూరు ఓటరు.





## ఇంకా చాలా ఉంది!

### 2019 నుంచి 2024కు మారిన లెక్క

2019లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వైసీపీ 14 స్థానాల్లో 13 గెలిచి భారీ ఆధిపత్యం సాధించింది. కుప్పంలో మాత్రం చంద్రబాబు టీడీపీ కోటను కాపాడుకున్నారు. 2024లో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. కూటమి 12 స్థానాలు గెలుచుకోగా, పుంగనూరు, తంబళ్లపల్లెల్లో మాత్రమే వైసీపీ నిలిచింది. దీంతో జిల్లాలో అధికార బలాబలాలు స్పష్టంగా మారాయి.

### పెద్దిరెడ్డి కుటుంబానికి కీలక పరీక్ష

పుంగనూరు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ ప్రభావానికి ప్రధాన కేంద్రం. తంబళ్లపల్లెలో పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కూడా కుటుంబ బలాన్ని నిలబెట్టారు. అయితే 2019తో పోలిస్తే 2024లో రెండు నియోజకవర్గాల్లో మెజారిటీలు భారీగా తగ్గాయి. దీంతో పెద్దిరెడ్డి కుటుంబ కోటల్లో పట్టు కొనసాగుతున్నా, గతంలో ఉన్నంత బలంగా లేదన్న రాజకీయ చర్చ మొదలైంది. 2029 ఎన్నికలు ఈ ప్రభావానికి అసలు పరీక్షగా మారనున్నాయి.

### నారా వ్యూహాలకు కుప్పం బలమైన కోట

చంద్రబాబుకు కుప్పం కేవలం నియోజకవర్గం కాదు.. ఆయన రాజకీయ గుర్తింపు. 2019లో 30,722 ఓట్ల మెజారిటీతో గెలిచిన చంద్రబాబు, 2024లో ఏకంగా 48,006 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. కుప్పం బలం మరింత పెరగడం టీడీపీకి కీలక సంకేతంగా మారింది. ఇప్పుడు ఈ ప్రభావాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇతర నియోజకవర్గాలకు విస్తరించడమే నారా వ్యూహాలకు ప్రధాన సవాల్.

### తిరుపతి నుంచి కొత్త రాజకీయ శక్తి

తిరుపతిలో 2024 ఎన్నికల ఫలితం చిత్తూరు రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరతీసింది. జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. గతంలో స్వల్ప ఆధిక్యాలతో మారుతూ వచ్చిన తిరుపతి ఇప్పుడు జనసేనకు కీలక స్థావరంగా మారింది. 2029 నాటికి జనసేన తన ప్రభావాన్ని తిరుపతి దాటి విస్తరిస్తే, టీడీపీ-వైసీపీ పోరులో మరో ప్రధాన శక్తికేంద్రం ఏర్పడే అవకాశం ఉంది.

### చివరి మాట ఓటరుదే

చిత్తూరు రాజకీయాలను కేవలం పెద్దిరెడ్డి వర్సెస్ నారా పోరుగా చూడలేం. చంద్రగిరి, నగరి, పీలేరు, శ్రీకాళహస్తి, చిత్తూరు, పలమనేరు వంటి నియోజకవర్గాల్లో ప్రభుత్వ పనితీరు, అభ్యర్థుల ఎంపిక, స్థానిక సమీకరణాలు కీలకం కానున్నాయి. 2019లో వైసీపీకి 13-1 తీర్పు ఇచ్చిన ఓటరు, 2024లో కూటమికి 12-2 తీర్పు ఇచ్చాడు. 2029లోనూ తుది తీర్పు నాయకులది కాదు.. ఓటరుదే.

### 2026.. ఎవరి వైపు గాలి?

**2026 నాటికి రాజకీయ బలాబలాలను చూస్తే కూటమి స్పష్టమైన ఆధిక్యంలో ఉంది. టీడీపీకి అత్యధిక స్థానాలు ఉన్నాయి. కుప్పంలో చంద్రబాబు బలంగా ఉన్నారు. చంద్రగిరి, పీలేరు, శ్రీకాళహస్తి, నగరి, పలమనేరు వంటి ప్రాంతాల్లో టీడీపీకి ఎమ్మెల్యేల బలం ఉంది. తిరుపతిలో జనసేనకు బలం వచ్చింది. వైసీపీకి పుంగనూరు, తంబళ్లపల్లె ప్రధాన స్థావరాలుగా మిగిలాయి. అందుకే 2026 సమీకరణాన్ని ఒక మాటలో చెప్పాలంటే.. కూటమి ఆధిపత్యం.. వైసీపీ ప్రతిఘటన. అయితే రాజకీయాల్లో ప్రస్తుతం ఉన్న బలం శాశ్వతం కాదు. 2026లో ఆధిపత్యంలో ఉన్న పార్టీ 2029లో అదే స్థాయిలో ఉంటుందని చెప్పలేం. 2029 ఎన్నికలకు ముందున్న కాలం టీడీపీ-వైసీపీ రెండింటికీ కీలకం. కూటమి ప్రభుత్వం ఐదేళ్ల పాలన పూర్తిచేసే సమయానికి ప్రజలు అభివృద్ధి, సంక్షేమం, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, ప్రభుత్వంపై తమ అభిప్రాయాన్ని బేరీజు వేసుకుంటారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయి? రోడ్లు, నీరు, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరాయి? స్థానిక నాయకులు ప్రజలకు అందుబాటులో ఉన్నారా? అనే ప్రశ్నలకు సమాధానాలే 2029లో కూటమి బలాన్ని నిర్ణయిస్తాయి. వైసీపీకి మాత్రం ఈ కాలం పునర్నిర్మాణానికి కీలకం. పాత నాయకత్వాన్ని పునర్వ్యవస్థీకరించడం, యువ నాయకత్వాన్ని ముందుకు తీసుకురావడం, 2019లో ఉన్న ఓటు బ్యాంకును తిరిగి ఏకం చేయడం, ప్రభుత్వ వ్యతిరేక ఓటును తన వైపు తిప్పుకోవడం వైసీపీ ముందున్న ప్రధాన సవాళ్లు. పుంగనూరు, తంబళ్లపల్లెల్లో నిలిచిన పట్టు ఇతర నియోజకవర్గాలకు విస్తరించగలిగితే 2029లో పోటీ స్వరూపం మారవచ్చు.**

# టెస్టుల్లో అరుదైన ఘనత

### సచిన్ రికార్డును సమం చేసిన జో రూట్




ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ జో రూట్ భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సరసన నిలిచాడు. పాకిస్థాన్‌తో హెడింగ్లీలో జరుగుతున్న తొలి టెస్ట్‌లో రూట్ తన 68వ టెస్ట్ అర్ధశతకాన్ని నమోదు చేసి, టెస్టుల్లో అత్యధిక 50+ స్కోర్ల రికార్డులో సచిన్‌తో సమంగా నిలిచాడు. రెండో రోజు ఆటలో రూట్ 112 బంతుల్లో 66 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు ఉన్నాయి. టెస్టుల్లో అత్యధిక అర్ధశతకాల జాబితాలో రూట్, సచిన్ చెరో 68 అర్ధశతకాలతో అగ్రస్థానంలో ఉన్నారు. వెస్టిండీస్ దిగ్గజం శివనరైన్ చంద్రపాల్ 66 అర్ధశతకాలతో మూడో స్థానంలో ఉండగా, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అలన్ బోర్డర్, భారత మాజీ ఆటగాడు రాహుల్ ద్రవిడ్ 63 చొప్పున అర్ధశతకాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. టెస్టుల్లో అత్యధిక పరుగుల సచిన్ రికార్డుపైనా రూట్ కన్నేశాడు. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే ఆలౌట్ కాగా, ఇంగ్లండ్ 205/4తో 34 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

# శ్రీలంకతో రెండో టెస్టులో కొత్త ముఖం!

### సారంశ్ జైన్ అరంగేట్రానికి రంగం సిద్ధం

శ్రీలంకతో కొలంబో వేదికగా ఆగస్టు 23 నుంచి ప్రారంభం కానున్న రెండో టెస్టులో టీమిండియా తుది జట్టులో కీలక మార్పు చేసే అవకాశం కనిపిస్తోంది. 33 ఏళ్ల ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్ సారంశ్ జైన్ అంతర్జాతీయ టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నట్లు సమాచారం. గాయంతో వాషింగ్టన్ సుందర్ అందుబాటులో లేకపోవడంతో సారంశ్‌ను జట్టులోకి ఎంపిక చేశారు. ఇప్పుడు తుది జట్టులోనూ చోటు దక్కే అవకాశాలు బలంగా ఉన్నాయి. సారంశ్ అరంగేట్రం చేస్తే ఎడమచేతి వాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ తుది జట్టులో చోటు కోల్పోయే అవకాశం ఉందని నివేదికలు పేర్కొంటున్నాయి. గాలే టెస్టులో కుల్దీప్ 103 పరుగులు ఇచ్చి ఒక వికెట్ మాత్రమే సాధించాడు. మరోవైపు సారంశ్ దేశవాళీ క్రికెట్‌లో పదేళ్లకు పైగా నిలకడగా రాణిస్తున్నారు. 2014లో ఫస్ట్‌క్లాస్ అరంగేట్రం చేసిన ఆయన 181 వికెట్లు, 2,223 పరుగులు సాధించారు. గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించగా, మానవ్ సుతార్ ఏకంగా 10 వికెట్లతో సత్తా చాటాడు. ఈ విజయంతో ఉత్సాహంగా ఉన్న టీమిండియా రెండో టెస్టులో సిరీస్‌పై పట్టు మరింత బిగించాలని భావిస్తోంది.

# నేను మనిషినే.. యంత్రాన్ని కాను




### 6 విజయాల తర్వాత 6 పరాజయాలు

ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ అనూహ్య పతనంపై ఆ జట్టు బ్యాటర్ శశాంక్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తొలి ఏడు మ్యాచ్‌ల్లో ఆరు విజయాలతో దూసుకెళ్లిన పంజాబ్.. ఆ తర్వాత వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఓడిపోయి ప్లేఆఫ్స్‌కు దూరమైంది. ఈ సమయంలో డ్రెస్సింగ్‌రూమ్‌లో విభేదాలు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరిగినా, అందులో ఎలాంటి నిజం లేదని శశాంక్ స్పష్టం చేశాడు. కీలక క్యాచ్‌లు జారవిడవడం, ముఖ్యమైన ఓవర్లలో బౌలింగ్ విఫలం కావడం, భాగస్వామ్యాలను సద్వినియోగం చేసుకోలేకపోవడం వంటి చిన్న తప్పులే జట్టు పతనానికి కారణమయ్యాయని చెప్పాడు. ఫీల్డింగ్‌లో క్యాచ్‌లు వదిలేయడంపై శశాంక్ తొలిసారి తన మనసులోని బాధను బయటపెట్టాడు. రోజుకు 500 నుంచి 1,000 క్యాచ్‌లు ప్రాక్టీస్ చేసినా, వరుస తప్పిదాల తర్వాత ఫీల్డింగ్‌ను ఆస్వాదించడం మానేశానని తెలిపాడు. స్నేహితులు ఇప్పటికీ తనను క్యాచ్‌ల విషయంలో ఆటపట్టిస్తుంటారని చెప్పిన శశాంక్.. ప్రతి మ్యాచ్‌లో సెంచరీ చేయడం, ఒక్క క్యాచ్ కూడా వదలకపోవడం సాధ్యం కాదన్నాడు. “నేను కూడా మనిషినే.. యంత్రాన్ని కాదు. తప్పులు జరగొచ్చు. ఆ అనుభవం నాకు పాఠం నేర్పింది” అంటూ భావోద్వేగంగా స్పందించాడు. ఇక దేశవాళీ క్రికెట్‌లో పుదుచ్చేరికి మారిన శశాంక్.. ప్రస్తుతం వైట్ బాల్ క్రికెట్‌పై దృష్టి పెట్టి, పూర్తి స్థాయి ఆల్‌రౌండర్‌గా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.



# హార్దిక్ రేట్... ముంబై ట్విస్ట్!

### కొత్త పోస్టుతో పెరిగిన ఉత్కంఠ

ముంబై ఇండియన్స్ సోషల్ మీడియాలో చేసిన తాజా పోస్టు ఐపీఎల్ 2027కి ముందు హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై కొత్త చర్చకు తెరలేపింది. హార్దిక్‌ను ట్రేడ్ చేయబోతున్నారంటూ వార్తలు వస్తున్న వేళ, ముంబై ఇండియన్స్ అతడి ప్రాక్టీస్ ఫొటోలను వరుసగా పోస్ట్ చేయడం అభిమానుల్లో ఆసక్తి పెంచింది. దీంతో కొందరు హార్దిక్ ముంబైలోనే కొనసాగడం ఖాయమని భావిస్తుండగా, మరికొందరు ట్రేడ్ ప్రక్రియలో భాగంగానే ఈ పోస్టు వచ్చిందేమోనని అనుమానిస్తున్నారు. 2015లో ముంబై తరఫున ఐపీఎల్ అరంగేట్రం చేసిన హార్దిక్ 2022లో గుజరాత్ టైటాన్స్‌కు వెళ్లారు. తొలి సీజన్‌లోనే గుజరాత్‌ను చాంపియన్‌గా నిలిపి, మరో ఏడాది కెప్టెన్‌గా కొనసాగారు. ఆ తర్వాత ట్రాన్స్‌ఫర్ ద్వారా ముంబై తిరిగి తీసుకొచ్చి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించింది. అయితే 2024లో ముంబై పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలవగా, 2025లో క్వాలిఫయర్ 2 వరకు చేరింది. 2026 సీజన్‌లో తొమ్మిదో స్థానంతో ముగించింది. ఈ నేపథ్యంలో హార్దిక్ ట్రేడ్ ఊహాగానాలు మరింత వేడెక్కాయి. మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కూడా ఐపీఎల్ ట్రేడ్లలో పూర్తి పారదర్శకత అవసరమని సూచించడం చర్చకు మరింత బలం చేకూర్చింది.

# 90 ఏళ్ల ఘనమైన నట వారసత్వం మాది




భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్ తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. ఈ సందర్భంగా నాగార్జునతో పాటు అతడి కుమారులు వారి సినీ ప్రయాణం, కెరీర్‌కు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. అక్కినేని కుటుంబం నుంచి తొమ్మిది దశాబ్దాల సినిమా చరిత్ర కొనసాగుతుండటం పట్ల టాలీవుడ్ కింగ్ నాగార్జున సంతోషం వ్యక్తం చేశారు. లెగసీ అంటే కేవలం నటులుగా ఉండటం కాదని, మొత్తం సినిమా రంగానికే సేవ చేయడమని ఆయన స్పష్టం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు అడుగుజాడల్లో తాను ప్రయాణించానని, ఇప్పుడు తన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా అదే బాటలో నడుస్తున్నారని తెలిపారు. సృజనాత్మక రంగంలో క్రమశిక్షణ ఎంత ముఖ్యమో చెబుతూ, షూటింగ్ సెట్స్‌లో ఎవరికోసం ఎప్పుడూ ఇబ్బంది కలిగించకూడదనే తన సిద్ధాంతాన్ని గుర్తుచేసుకున్నారు. 'శివ', 'గీతాంజలి' వంటి సాహసోపేతమైన చిత్రాలతో తాను ఎలా కొత్త మార్గాన్ని ఎంచుకున్నానో, అదే రీతిలో కుమారులు కూడా సొంత గుర్తింపు తెచ్చుకోవాలని నాగార్జున ఆకాంక్షించారు. నాగచైతన్య మాట్లాడుతూ.. దాదాపు 90 ఏళ్ల సినిమా ప్రయాణం కాలాతీతమైనదని, తాత నాగేశ్వరరావు, తండ్రి నాగార్జునల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చైతూ తెలిపారు. సినిమా పరిశ్రమలోకి వచ్చిన మొదట్లో తనకంటూ ఒక స్టైల్ వెతుక్కునే క్రమంలో ఎంతో ఒత్తిడిని ఎదుర్కొన్నానని, అయితే కాలక్రమేణా సినిమాపై ఉన్న ఇష్టంతో ఆ సవాళ్లను అధిగమించానని చెప్పారు. అక్కినేని కుటుంబం అందించిన లెగసీని కాపాడుకోవడం తమ బాధ్యత అని యంగ్ హీరో అఖిల్ అక్కినేని పేర్కొన్నారు. తమ కుటుంబం నుంచి వచ్చిన వారసత్వాన్ని 'బంగారు బ్యాటన'తో పోల్చిన ఆయన, దానిని మరింత ముందుకు తీసుకువెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. తాత ఇచ్చిన వారసత్వాన్ని ఎప్పటికీ గుండెల్లో దాచుకుంటామని అఖిల్ భావోద్వేగంగా పంచుకున్నారు.





# మమితా బైజు.. మరో మూవీతో సిద్ధం

'ఇప్పుడెందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ 'విశ్వనాథ్ అండ్ సన్స' చిత్రంతో ఇటీవలే తెరపై సందడి చేసి కుర్రకారుని ఆకట్టుకుంది అందాల తార మమితా బైజు. ఇప్పుడీ జోష్‌లోనే మరో ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించడానికి రెడీగా ఉంది. ఆమె, నివిన్ పౌలీ జంటగా నటించిన చిత్రం 'బెత్లెహెం కుడుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీశ్ ఏడీ తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు సినీప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగానే తాజాగా మరో పోస్టర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది మమిత. అందులో ఆమె కూర్చొని చిరునవ్వులు చిందిస్తూ ఆకట్టుకుంటుంది. ఫహాద్ ఫాజిల్, దిలీష్ పోతాన్ నిర్మించిన ఈ రొమాంటిక్ ప్రేమకథా చిత్రం ఈ నెల 21న థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉంది.




# రంభ ఊర్వశి మేనక నుంచి మరో పాట విడుదల

'రంభ ఊర్వశి మేనక' అంటూ అల్లరి చేయడానికి సిద్ధమయ్యారు అల్లరి నరేశ్. ఆయన ప్రధానపాత్రలో తెరకెక్కిన ఈ సినిమా సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఇందులోని రెండో పాటను విడుదల చేశారు. 'బ్యాడ్ టైమ్ బ్యాండ్ బాజా' అంటూ సాగే ఈ పాటలో వెళ్లవే పేదరికం.. ఇక్కడే ఇల్లరికం అనే లిరిక్స్ నేపథ్యానికి తగినట్లుగా ఉన్నాయి. చంద్రమోహన్ చింతా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నరేశ్‌కు జోడీగా సురభి నటించారు.



# తల్లిదండ్రుల మధ్య సేదదీరిన విజయ్ దేవరకొండ

### ఫోటోను షేర్ చేసిన రష్మిక మందన్నా

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ తన కుటుంబంతో గడిపిన మధురమైన క్షణాలకు సంబంధించిన ఒక క్యూట్ ఫోటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట తెగ వైరల్ అవుతోంది. భారీ వర్షాల కారణంగా విజయ్ తాజా సినిమా షూటింగ్ అనూహ్యంగా రద్దు కాగా, ఆ సమయాన్ని ఆయన పూర్తిగా తన కుటుంబంతో కలిసి విశ్రాంతిగా గడపాలని నిర్ణయించుకున్నారు. చిన్నతనంలో తాను ఎంతో ఇష్టపడే ప్రదేశంలో, తన తల్లిదండ్రుల మధ్య హాయిగా నిద్రపోతున్న ఒక అరుదైన ఫోటోను ఆయన తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ పిక్‌కు విజయ్ క్యాప్షన్ ఇస్తూ, వర్షం కారణంగా షూటింగ్ రద్దయిందని, చిన్ననాటి ఇష్టమైన ప్రదేశంలో మధ్యాహ్నం పూట ఇలా ప్రశాంతంగా నిద్రపోవడం వల్ల తన ఎనర్జీ రీఛార్జ్ అయిందని తెలిపారు. అంతేకాకుండా, ఈ అందమైన ఫొటోను తన సతీమణి, ప్రముఖ నటి రష్మిక మందన్న తీశారంటూ ఆమెకు ప్రత్యేకంగా క్రెడిట్ ఇవ్వడం విశేషం. ఈ దంపతుల అన్యోన్యతను చూసి అభిమానులు మురిసిపోతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వివాహ బంధంలోకి అడుగుపెట్టిన విజయ్, రష్మిక జోడీ ఆన్ స్క్రీన్‌పై కూడా మరోసారి సందడి చేయడానికి సిద్ధమవుతోంది.




# మ్యూజికల్ డ్రామా.. జగమే సంగీతం

### అమెజాన్‌లో 4నుంచి వెబ్ సిరీస్

టాలీవుడ్‌లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిన మ్యూజికల్ డ్రామా సిరీస్ 'జగమే సంగీతం' ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ ప్రపంచవ్యాప్త ప్రీమియర్ తేదీని అధికారికంగా ప్రకటించింది. కర్ణాటక సంగీత నేపథ్యంతో రూపొందిన ఈ ఒరిజినల్ సిరీస్ సెప్టెంబర్ 4 నుంచి ప్రసారం కానుంది. ప్రముఖ హిందీ సిరీస్ 'బందిష్ బాండిట్స్' స్ఫూర్తితో తెరకెక్కిన ఈ ప్రాజెక్ట్‌ను పల్నాటి సూర్య ప్రతాప్ సృష్టించి దర్శకత్వం వహించగా, సుష్మిత కొణిదెల నిర్మించారు. ప్రకాష్ రాజ్, శ్రీకాంత్, మధుబాల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో అక్షయ్ లగుసాని, సుస్మితా శెట్టి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వంగాల సూర్య మనోజ్, శ్రావణి సముద్రాల, ఎ.ఆర్. ప్రభావ్ ఈ సిరీస్‌కు కథను అందించగా, విశాల్ చంద్రశేఖర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.